


అమ్మ.. ఒక యోధ

- పిల్లల ఉన్నతికి నిత్యం శ్రమించే మాతృమూర్తి
- జీవితాంతం కష్టించే శ్రమజీవి
- భవితకు బంగారు బాటలు వేసే శక్తి స్వరూపిణి
- నేడు అంతర్జాతీయ మాతృ దినోత్సవం

6

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
5
ఆదివారం, 11 మే 2025



దేశంలో అధికంగా మిర్చిసాగు చేస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ కూడా ఒకటి. తెలంగాణలో పసుపుబోర్డును నిజామాబాద్ జిల్లాలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన నేపథ్యంలో ఇప్పుడు మిర్చిబోర్డు కూడా ఏర్పాటుచేయాలని రైతులు కోరుతున్నారు. అటువైపు ఆంధ్రాలో కూడా మిర్చిబోర్డు ఏర్పాటుచేయాలని అక్కడి ప్రభుత్వం ప్రయత్నాలు సాగిస్తుండగా, తెలంగాణలో మిర్చిబోర్డు ఏర్పాటుచేయాలని ఇక్కడి రైతులసంఘాలు ఆందోళనకు దిగాయి. మిర్చిబోర్డు ఏర్పాటుకు కార్యాచరణను రైతుసంఘాలు రూపొందిస్తున్నాయి.



మిర్చి బోర్డు మంజూరయ్యేనా!?

- ఇరు రాష్ట్రాల్లో బోర్డు ఏర్పాటుకు ఊపందుకున్న డిమాండ్
- తెలంగాణ, ఆంధ్రకు నడుమ ఖమ్మంలో ఏర్పాటు చేస్తే ఎంతో ఉపయోగం
- రాష్ట్రంలో ఏటా 3 లక్షలకు పైగా ఎకరాల్లో మిర్చి సాగు
- బోర్డు ఏర్పాటయితే రైతులకు ఎంతో మేలు
- శిక్షణ, పంట ఎగుమతిపై అవగాహన పెరిగే అవకాశం
- బోర్డు ఏర్పాటు కోసం ఉద్యమిస్తున్న రైతుసంఘాలు
- ఇప్పటికే సమావేశాలు, భవిష్యత్ ప్రణాళికలు

ఖమ్మం, మే 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణలో సుమారు 3 లక్షల నుంచి 4 లక్షల ఎకరాల్లో ప్రతీ సంవత్సరం మిర్చిసాగవుతోంది. అందులో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, ములుగు జిల్లాలతో పాటు సూర్యాపేట, నల్గొండ, గద్వాల తదితర జిల్లాల్లో మిర్చి సాగవుతోంది. ఏపీలో ఉమ్మడి గుంటూరు, కృష్ణా, ప్రకాశం, నెల్లూరుతోపాటు రాయలసీమలోని కర్నూలు తదితరజిల్లాల్లో కూడా మిర్చిసాగు చేస్తున్నారు. ఏపీలో సుమారు 5లక్షల నుంచి 6లక్షల ఎకరాల వరకు మిర్చిసాగు ఉంది. అయితే ఇప్పటి వరకు దేశ వ్యాప్తంగా ఎక్కడా మిర్చి బోర్డు లేదు. నిజామాబాద్ జిల్లాకు చెందిన రైతులు దశాబ్దకాలంగా సాగించిన పోరాటం నేపథ్యంలో కేంద్రం పసుపుబోర్డు ఏర్పాటుచేసింది. అలాగే అత్యంత మెరుగైన వాణిజ్యపంట అయిన మిర్చికి కూడా బోర్డు కావాలని రైతులు కోరుతున్నారు. తెలంగాణ, ఆంధ్రాకు గేట్ వేగా ఉన్న ఖమ్మం జిల్లాలో మిర్చిబోర్డు ఏర్పాటుచేస్తే రెండు తెలుగురాష్ట్రాలకు సౌలభ్యంగా ఉంటుందని ఇక్కడి రైతులు సూచిస్తున్నారు.

బోర్డు ఏర్పాటుచేస్తే..

మిర్చి బోర్డు ఏర్పాటుచేయడం ద్వారా అంతర్జాతీయంగా మార్కెట్ స్థితిగతులు విదేశీ ఎగుమతులకు, మిర్చి రైతులకు తరుచు శిక్షణ కార్యక్రమాలు, మేలురకమైన మిర్చిపంట సాగుకు విత్తన ఉత్పత్తికి బోర్డు ద్వారా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. బోర్డుకు ప్రత్యేక నిధులు, అధికారాలతోపాటు ప్రత్యేకంగా యంత్రాంగం ఉండటంతో రైతులకు మిర్చిపంటపై తరుచు అవగాహన సదస్సులు, క్రిమిసంహారక మందులు కాకుండా సేంద్రియపద్ధతిలో మిర్చిసాగు రైతులకు బోర్డు ద్వారా ప్రోత్సాహకాలు అందించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం మిర్చిపంట ఉద్యానవన శాఖ పరిధిలో ఉంది. ఇతరపంటలవలే ఉద్యానశాఖ పంటలపై అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు. ఇప్పటి వరకు మిర్చిపంటకు కనీస మద్దతు ధర లేదు. దీంతో మిర్చి మార్కెట్ పరిస్థితి లాటరీగా మారింది. రాష్ట్రంలో ఖమ్మం, వరంగల్ వ్యవసాయమిర్చి మార్కెట్ల ద్వారా మిర్చి దేశ, విదేశాలకు ఎగుమతి అవుతుంది. ప్రధానంగా చైనా, బంగ్లాదేశ్, ఇండోనేషియా, సింగపూర్, శ్రీలంక తదితర దేశాలకు మిర్చిఎగుమతి అవుతుంది.

అయితే అంతర్జాతీయ మార్కెట్‌లో మిర్చి మార్కెట్ పరిస్థితి తెలియక ఆయాదేశాల్లో ఎక్కువస్థాయిలో ఎగుమతి చేయకపోవడంతో మిర్చి మార్కెట్ ఒడిదుడకులు ఎదుర్కొంటుంది. గతేడాది క్వింటాకు రూ.20వేల నుంచి 23వేల ధర లభించగా ఈఏడాది రూ.13 వేలవరకు క్వింటా ధర నడుస్తోంది.

రైతు సంఘాల పోరాటం

ఖమ్మంలో మిర్చిబోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం, తెలంగాణ రైతు సంఘంతోపాటు పలు పార్టీల అనుబంధ సంఘాల రైతులు, సీపీఎం, సీపీఐ, మాస్‌లైన్ పార్టీలు మిర్చిబోర్డు ఏర్పాటుచేయాలని ఆందోళన సాగిస్తున్నాయి. ఖమ్మం కలెక్టరేట్ ముందు ధర్నా, మిర్చి మార్కెట్ ముట్టడి, రైతులు, వ్యాపారులతో రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించారు. వచ్చేనెల నుంచి మిర్చిబోర్డు కోసం సంఘటిత కార్యక్రమాలు చేపట్టనున్నారు.

మిర్చి బోర్డు సాధించే వరకు పోరాటం



బాగం హేమంతరావు, రాష్ట్ర రైతుసంఘం అధ్యక్షుడు

తెలంగాణ నుంచి మిర్చి దేశ, విదేశాలకు ఎగుమతి అవుతోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నాణ్యమైన మిర్చి పండుతుంది. అందువల్ల ఇక్కడ మిర్చిబోర్డు ఏర్పాటుచేస్తే మిర్చి రైతులకు ఉపయోగం ఉంటుంది. ప్రస్తుతం రైతులకు గిట్టుబాటు ధర ఉండడంలేదు. రైతులకు గిట్టుబాటు ధరతోపాటు దేశ, విదేశాల్లో ఎగుమతులు పెరిగేందుకు పంట నాణ్యత, దిగుబడులు పెంచేందుకు బోర్డు ఏర్పాటువల్ల రైతులకు ఉపయోగం ఉంటుంది. ప్రత్యేక ప్రోత్సాహకాలు బోర్డుద్వారా వస్తాయి.



రేగులకుంట చెరువులో పూలు చల్లుతున్న మంత్రి తుమ్మల

రైతుల సాగునీటి కల సాకారం

- రూ.64 కోట్లతో 2,400 ఎకరాలకు సాగర్ జలాలు
- 'మంచుకొండ' రఘునాథపాలెం రైతుల స్వప్నం
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- రేగులకుంట చెరువు వద్ద పూజలు

రఘునాథపాలెం, మే 10(ఆంధ్రజ్యోతి): విద్యుత్, వ్యవసాయ బోరు బావులు, వరుణుడి కటాక్షంపై ఆధారపడిన రఘునాథపాలెం మండలంలోని సాగు రైతుల కల సాకారమైందని, ఎన్నో ఏళ్ల తన లక్ష్యం నెరవేరిందని, తక్కువ వ్యయంతో ఎక్కువ సాగు విస్తీర్ణానికి నీరు ఎలా అందించాలో మంచు కొండ ఎత్తిపోతల పథకం ద్వారా నిరూపణ జరిగిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. శనివారం రఘునాథపాలెం మండలంలోని మంచుకొండ ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించారు. మంచుకొండ ఎత్తి పోతల పథకం ద్వారా సాగర్ జలాలు రేగులకుంట చెరువులోకి వెళ్లి జలకళతో స్థానిక రైతుల నుంచి పశువుల వరకు సంతోషాన్ని నింపింది. మండే ఎండలో చెరువులకు జలాలు చేరటంతో రైతులు సంతోషంతో మునిగి తేలారు. గిరిజన రైతుల కోరిక మేరకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సాగర్ జలాలతో నిండిన చెరువులను పరిశీలించారు.

రేగులకుంట చెరువు వద్ద మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సాగర్ జలాలకు పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తాను గతంలోను ఖమ్మం ఎమ్మెల్యేగా పనిచేసిన కాలంలోనే రఘునాథపాలెం మండలానికి సాగు నీటి కష్టాలు తీర్చేందుకు బుగ్గవాగుకు చెక్ డ్యామ్‌కు ప్రతిపాదనలు పూర్తి చేశానని అన్నారు. తర్వాత వచ్చిన వారు దాన్ని కాంట్రాక్టు తీసుకొని పనులు చేయకపోవటంతో పదేళ్ల పాటు (మిగతా 6వ పేజీలో)



ర్యాలీలో పాల్గొన్న మేయర్, ఉపమేయర్, కార్పొరేటర్లు, ఉద్యోగులు

ఉగ్రవాదాన్ని తుద ముట్టించాలి

- పాకిస్థాన్ కవ్వింపు చర్యలకు ఇదే ముగింపు కావాలి
- నగరపాలక సంస్థ మేయర్ నీరజ
- భారత సేనలకు మద్దతుగా ర్యాలీ, మానవహారం
- పాలకవర్గం ఒక నెల వేతనం రూ.5.5 లక్షల విరాళం

ఖమ్మం సంక్షేమ విభాగం, మే 10(ఆంధ్రజ్యోతి): భవిష్యత్‌లో భారతదేశం వైపు పాకిస్థాన్ కన్నెత్తి చూడాలంటే కంపించే విధంగా భారత సైన్యం సరైన బుద్ధి చెప్పిందని, ఆపరేషన్ సిందూర్‌కు తాము అండగా నిలుస్తామని ఖమ్మం నగర పాలక సంస్థ మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. ఖమ్మం నగర పాలకసంస్థ వర్గం మేయర్ ఆధ్వర్యంలో కేఎంసీ కార్యాలయం నుంచి బైపాస్ రోడ్డు వరకు శనివారం ర్యాలీ నిర్వహించారు. ఆర్టీవో కార్యాలయం సర్కిల్‌లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ నీరజ మాట్లాడుతూ భార్యల కళ్లెదుటే భర్తలను దారుణంగా కాల్చి చంపారని ఇటువంటి ఉగ్రవాదం ప్రపంచంలో ఎక్కడ లేదన్నారు. భారత సైన్యం పాకిస్థాన్ ప్రజలకు ప్రాణ, ఆస్తి నష్టం కలిగించలేదని, కానీ పాకిస్థాన్ సైన్యం మాత్రం బోర్డర్‌లో ఉన్న భారతదేశ గ్రామాల అమాయక ప్రజలను టార్గెట్ (మిగతా 6వ పేజీలో)



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

తెలంగాణలో దోపిడీని సాగనివ్వం

- దొరల పాలన కోసం దోపిడీదారులు ఏకమవుతున్నారు
- ఫామ్‌హౌస్‌లో పడుకొని అవాకులు చవాకులు పేలుతున్నారు
- రాష్ట్రంలో పాత పథకాలతో పాటు కొత్త పథకాలూ అమలు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

అశ్వారావుపేట, మే 10 (ఆంధ్రజ్యోతి): ధనిక రాష్ట్రమైన తెలంగాణను నిలువునా దోపిడీ చేసి, అప్పులపాలు చేసి ఫామ్‌హౌస్‌లో పడుకొన్న వారు తమ ప్రభుత్వంపై అవాకులు చవాకులు పేలుతున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విమర్శించారు. రాష్ట్ర సంపదను సంక్షేమ పథకాల ద్వారా నాలుగుకోట్ల ప్రజలకు పంచడం న్యాయమా? తెలంగాణ పేరుతో మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులు, ఆయన పార్టీ నేతలు నిలువుదోపిడీ చేయడం న్యాయమా? అని ప్రశ్నించారు. దొరల పాలన కోసం తెలంగాణలోని దోపిడీదారులంతా ఏకమవుతున్నారని, ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలని భట్టి సూచించారు. అశ్వారావుపేట నియోజకవర్గానికి రూ. 40కోట్లతో మంజూరైన విద్యుత్ ఉప కేంద్రాలకు అశ్వారావుపేట పామాయిల్ కర్మాగారం ఆవరణలో శనివారం రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు.

అనంతరం ఎమ్మెల్యే ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ అధికారాన్ని అడ్డుపెట్టుకొని అడ్డగోలుగా దోపిడీ చేసి ఫామ్‌హౌస్‌లో పడుకొని విచ్చలవిడిగా డబ్బులు ఖర్చుపెడుతూ సభలు పెడుతూ బీఆర్ఎస్ నాయకులు ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారని విమర్శించారు. తెలంగాణలో ఇక వారి ఆటలు, దోపిడీని సాగనివ్వబోమన్నారు. ఇందిరమ్మ పాలన వచ్చిన ఏడాదిలోనే వారు చేసిన అప్పులు, వాటికి వడ్డీల కింద ప్రతి నెల రూ.6,500కోట్లు చెల్లిస్తూ దశలవారీగా అనేక సంక్షేమ పథకాలు చేపడుతున్నామన్నారు. కాళేశ్వరం పేరుమీద రూ.లక్ష కోట్లు గోదావరిలో పారబోశారన్నారు.

ఇందిరమ్మ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే 57వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు తెలిపారు. మొదటిదశలో నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామన్నారు. రూ.9వేల కోట్లతో రాజీవ్ యువ వికాసం ద్వారా నిరుద్యోగులకు ఉపాధిపథకం వంటి అనేక పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ పథకాలన్నీ కొత్త పథకాలు కావా? అని ప్రశ్నించారు. ఇలాంటి పథకాలు అమలు చేస్తుంటే పాలన రాదని అంటారా? అంటూ భట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో ప్రారంభించిన అన్ని సంక్షేమ పథకాలను తాము అమలు అవుతున్నాయని, ఏ పథకం (మిగతా 6వ పేజీలో)

వైరా ఏసీపీ బదిలీకి బ్రేక్

వైరా, మే 10 (ఆంధ్రజ్యోతి): వైరా ఏసీపీ ఎంఏ రెహ్మాన్ బదిలీ నిలిచిపోయింది. ఆ మేరకు డీజీపీ కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయి. ఈనెల 8న వైరా ఏసీపీగా ఉన్న రెహ్మాన్‌ను బదిలీ చేసి డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఇచ్చిన ఆదేశాలను రద్దు చేశారు. హైదరాబాద్‌లో పనిచేస్తున్న ఎస్.సారంగపాణిని వైరా ఏసీపీగా నియమిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను కూడా నిలిపివేశారు. 2023 మొదట్లో రెహ్మాన్ వైరా ఏసీపీగా బాధ్యతలు చేపట్టారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం ఓడిపోయి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఆయనే ఏసీపీగా కొనసాగుతున్నారు. రెండు సంవత్సరాల పదవీకాలం దాటింది. కారణాలు ఏమైనప్పటికీ ఉన్న ఫళంగా ఆయన బదిలీ జరిగింది. సెప్టెంబరులో రెహ్మాన్ ఉద్యోగ విరమణ చేయనున్నారు. బదిలీ అయిన వెంటనే తనకున్న మార్గాల ద్వారా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు తన ఉద్యోగ విరమణ కాలపరిమితి ఇతర కారణాలను రెహ్మాన్ తీసుకువెళ్లారని సమాచారం. దాంతో భట్టి విక్రమార్క సెప్టెంబరు వరకు రెహ్మాన్ వైరా ఏసీపీగా సెప్టెంబరు వరకు కొనసాగేందుకు గానూ సుముఖత వ్యక్తం చేసి అధికారులకు సూచించడంతో ఆయన బదిలీని నిలిపివేసినట్లు సమాచారం.

నేడు స్తంభాద్రి గిరి ప్రదక్షిణ

ఖమ్మం ఖానాపురం హవేలి, మే10(ఆంధ్రజ్యోతి): స్తంభాద్రి లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో స్వామి వారి జన్మనక్షత్రం సందర్భంగా గిరిప్రదక్షిణం నిర్వహిస్తున్నట్లు ఈవో జగన్‌మోహన్‌రావు తెలిపారు. సాయంత్రం 5:30 గంటల నుంచి ఆలయం నుంచి ఊరేగింపు జయకేతనాలతో మంగళవాయిద్యాలతో స్వామి వారి ఉత్సవమూర్తులతో గిరిప్రదక్షిణం ప్రాంభమవుతుందని తెలిపారు. రాత్రి 7:30గంటలకు గుట్టపై ప్రత్యేక వేదికలో భక్తుల దర్శనార్థం స్వాతి నక్షత్ర జ్యోతిని వెలిగించటం జరుగుతుందని తెలిపారు. ఈ ప్రదక్షణలో భక్తులు అధిక సంఖ్యలో హజరై కార్యాక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు.

ప్రశాంతంగా టీజీఆర్‌జేసీ ప్రవేశ పరీక్ష

ఖమ్మం ఖానాపురం హవేలి, మే 10 (ఆంధ్రజ్యోతి): టీజీఆర్‌జేసీ ప్రవేశ పరీక్ష శనివారం ప్రశాంతంగా జరిగినట్టు తెలంగాణ గురుకుల కళాశాల జిల్లా కోఆర్డినేటర్ బి.రమ తెలిపారు. జిల్లాలో మొత్తం 27 పరీక్ష కేంద్రాల్లో 6,967 మంది విద్యార్థులకు గాను 5,859 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు నిర్వహించారు. రాష్ట్రంలోని గురుకుల కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఆంగ్ల మీడియం ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ గ్రూపులలో చేరేందుకు పరీక్ష నిర్వహించారు. పరీక్షా కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ యాక్ట్ అమలు చేశారు. 200 మీటర్ల దూరంలోని ఇంటర్‌నెట్, కాపీయింగ్ సెంటర్లు, స్టేషనరీ షాపులు మూసివేశారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2:30 గంటల వరకు పరీక్షా కేంద్రాల వద్ద ఈ సెక్షన్ అమలుపరిచారు. విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం పరీక్షా కేంద్రాలలోకి అనుమతించారు.



గోల్డ్ మెడల్ అందుకోవాల్సిన రోజే


బలవన్మరణం

» బీటెక్ విద్యార్థిని భావన మృతి

తల్లాడ, మే10(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవంలో గోల్డ్‌మెడల్ అందుకోవాల్సిన రోజే ప్రతిభావంతురాలైన బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో స్వగ్రామం తల్లాడ మండలం కుర్నవల్లిలో శనివారం విషాదం నెలకొంది. హైదరాబాదు గురునానక్ ఇంజనీరింగ్ కళాశాలలో తల్లాడ మండలం కుర్నవల్లి గ్రామానికి చెందిన అయిలూరి భావన(22) బీటెక్ థర్డ్ ఇయర్ చదువుతుంది. ఇంజనీరింగ్ కళాశాల హాస్టల్‌లో ఉంటున్న భావన ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుర్నవల్లికి చెందిన అయిలూరి శేషిరెడ్డి - కృష్ణకుమారి దంపతులకు ఇద్దరు కుమార్తెలు. వీరిలో పెద్దకుమార్తె భావన నిందిని బీఎస్సీ నర్సింగ్ ఫైనలియర్ చదువుతోంది. చిన్నకుమార్తె బావన బీటెక్ సీఎస్సీ థర్డ్ ఇయర్ చదువుతుంది. శేషిరెడ్డి-కృష్ణకుమారి దంపతులు కుర్నవల్లిలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో స్వీపర్‌గా పార్ట్‌టైం చేస్తూ మరోవైపు వ్యవసాయ కూలీ పనికి వెళ్తు ఇద్దరు కుమార్తెలను చదివిస్తున్నారు. చదువుల్లో చుఏరుగ్గా ఉండే భావన బీటెక్ సెకండియర్ లో 92శాతం మార్కులతో కళాశాల టాపర్‌గా నిలిచింది. గురునానక్ ఇంజనీరింగ్ కళాశాల హాస్టల్‌లో భావనతోపాటు తల్లాడ మండలం ముద్దునూరు, రంగాపురం గ్రామాలకు చెందిన మరో ఇద్దరు బాలికలు కలిసి ఒకే రూంలో ఉంటున్నారు. శనివారం కళాశాలలో వార్షిక వేడుకలున్నాయి. ముద్దునూరుకు చెందిన బాలిక బంధువుల ఇంట్లో పెళ్లి ఉండడంతో హైదరాబాదు హాస్టల్ నుంచి ముద్దునూరు శుక్రవారం సాయంత్రం వచ్చింది. రంగాపురం గ్రామానికి చెందిన మరో బాలిక శీలం ఆకాంక్ష శనివారం తెల్లవారు జామున హైదరాబాదు నుంచి బయలుదేరి రంగాపురం వచ్చింది. ఈ బాలిక బస్సులో ఖమ్మం వచ్చినప్పుడు ఉదయం హాస్టల్‌లో ఉన్న భావనకు ఫోన్‌చేయగా లిఫ్ట్ చేయకపోవడంతో అనుమానం వచ్చి హాస్టల్ వార్డెన్‌కు ఫోన్‌చేసి భావన గురించి వాకబు చేసినట్టు తెలిసింది. దీంతో హాస్టల్ వార్డెన్ రూం వద్దకు వెళ్లి చూసి రూంలో ఒంటరిగా ఉన్న భావన ఉరేసుకుని మృతిచెందడాన్ని గమనించారు. ఈ విషయం వెంటనే కళాశాల మేనేజ్‌మెంట్ దృష్టికి తీసుకెళ్లగా వారు వెంటనే పోలీసులు, తల్లిదండ్రులకు సమాచారం అందించారు భావన మరణవార్త తెలిసిన వెంటనే తల్లిదండ్రులు, బంధువులు హైదరాబాదు వెళ్లారు.

“ సమాజంలో ఉన్నత స్థానంలో ఉండాలన్నా, వివిధ రంగాలలో రాణించాలన్నా, పేరు ప్రఖ్యాతలు సంపాదించాలన్నా ప్రతి ఒక్కరి వెంట అండగా ఉండే దైవం తల్లి. తన రెక్కలను ముక్కలుగా చేసి తన బిడ్డ సుఖంగా జీవించాలని కోరుకునేది తల్లే. బ్రహ్మ సృష్టిలో స్త్రీ పాత్ర సర్వోన్నతం. నవమాసాలు మోసి తన ప్రాణాలను ఫణంగా పెట్టి ప్రసవ వేదనను భరించి బిడ్డకు జన్మనిస్తుంది తల్లి. తల్లి పిల్లల అల్లరిని భరించి ప్రేమతో లాలించి విద్యాబుద్ధులు నేర్పి బతుకు బాట నేర్పిస్తుంది. భగవంతుడు అన్ని చోట్ల ఉండలేక అమ్మను సృష్టించాడని పురాణాలు వేదాలలో పలువురు కవులు, కళాకారులు చెబుతుంటారు. బిడ్డ ఏ చిన్న తప్పు చేసినా కడుపులో దాచుకుంటుంది తల్లి. అందుకే మాతృమూర్తికి ఓ ప్రత్యేక రోజంటూ ఉంది. అదే అంతర్జాతీయ మాతృమూర్తి దినోత్సవం. ప్రతీ సంవత్సరం మే నెల రెండో ఆదివారాన్ని మాతృదినోత్సవంగా నిర్వహించుకుంటాం. అమ్మలేకపోతే గమనం లేదు, సృష్టిలో జీవం లేదు. బిడ్డలను కంటి పాపలా కాపాడే తల్లికి మాతృదినోత్సవ శుభాకాంక్షలు. ”

- ఖమ్మం ఖానాపురం హవేలి/ కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్



ప్రస్తుత రోజులలో బిడ్డలకు తల్లిప్రేమ కరువవుతుంది. పుట్టిన మూడు నుంచి నాలుగు సంవత్సరాలు మాత్రమే బిడ్డ తల్లి వద్ద ఉంటున్న రోజులు ఇవి. అనంతరం ప్రైవేటు హోమ్‌లలోనో, అంతర్జాతీయ పాఠశాలలోనో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొందరు తల్లితండ్రులు మొదటి తరగతి నుంచే పిల్లలను హాస్టల్స్‌లలో వేసి తల్లి ప్రేమకు దూరం చేస్తున్నారు. బిడ్డకు గొప్పగొప్ప చదువులను అందించాలనే తపనతో తల్లి ప్రేమను సైతం త్యాగం చేస్తూ బిడ్డలకు ఉన్నత చదువులను అందించేలనే తపనతో బిడ్డలను దూరంగా ఉంచుతూ విద్యాబుద్ధులు నేర్పిస్తుంటారు. కాని తల్లి దగ్గర ఉంటూ చదువుకునే పిల్లలకు, తల్లికి దూరంగా ఉంటూ చదువుకునే పిల్లలకు తేడా చాలా ఉంటుంది. కొందరు పిల్లలు తల్లులను విడిచి పెట్టి ఇతర దేశాలలో, రాష్ట్రాల్లో జీవిస్తూ తల్లి ప్రేమకు దూరమవుతున్నారు. ఏదిఏమైనా బిడ్డను తల్లి వద్ద ఉంచి విద్యాబుద్ధులు నేర్పించటమే మంచిదనే అభిప్రాయం ఉంది.

అమ్మ..ఒక యోధ

- » పిల్లల ఉన్నతికి శ్రమించే మాతృమూర్తులు
- » జీవితాంతం కష్టించే శ్రమజీవులు
- » భవితకు బంగారు బాటలు వేసే శక్తి స్వరూపిణి
- » నేడు అంతర్జాతీయ మాతృదినోత్సవం

పురిటి నొప్పులు దిగమింగుకొని జన్మనిచ్చిన తల్లి పేగు బంధాన్ని స్మరించుకుంటూ వారు అందిస్తున్న చేస్తున్న ...కొనసాగిస్తున్న ...సేవలు సృష్టిలో వెలకట్టలేనిది అభివర్ణించలేని బంధం అమ్మ మాత్రమే. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రతి అమ్మకు శుభాకాంక్షలు తెలియజేస్తూ భద్రాద్రి జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల్లో రాణిస్తున్న మహిళలు తమ అమ్మతో ఉన్న అనుబంధాలను విశేషాలు..

మా అమ్మే నాధైర్యం

పి. రమాదేవి, షీటీం ఇన్‌చార్జ్, భద్రాద్రి జిల్లా



మా అమ్మ లలితను చిన్నప్పటి నుంచి చూస్తూ పెరిగాను. మా అమ్మలాగే ధైర్యంగా ఉండాలని అనుకున్నాను. మా ఇంట్లో మా నాన్నతో పాటు మా కుటుంబ భారాన్ని అమ్మ తీసుకుంది. చిన్నతనంలో అమ్మే నాతో ఆడ పిల్లలు ఉద్యోగం చేస్తూ వాళ్ల కాళ్ల మీద వాళ్లు నిలబడితే వాళ్లకి సమాజంలో గౌరవం వస్తుందని చెప్తూ ఉండేది. ఆడ పిల్లలకి ఏదైనా కష్టం వస్తే వాళ్లు ఆర్థికంగా ఉంటేనే వాళ్ళు ఆ కష్టాన్ని ఎదుర్కొనే ధైర్యం ఉంటుందని తెలిపింది. తప్పు చేయనప్పుడు ఎవ్వరికి భయపడొద్దు ...ధైర్యంగా మాట్లాడాలి అని ... నేడు అమ్మ ఇచ్చిన ధైర్యమే నన్ను నా ఉద్యోగంలో ముందుకు నడిపిస్తుంది. ఇప్పటికీ నేను ఏ సందర్భంగా అయినా తక్కువగా ఆలోచన చేస్తే మా అమ్మే నాకు ప్రేరణ తీసుకొని వెళ్తాను. ఇలాంటి అమ్మకి నేను కూతురుగా పుట్టడం నా అదృష్టం.

కుటుంబాన్ని నడిపే నావ అమ్మ

టి. సంధ్యారాణి, ప్రిన్సిపాల్, సింగరేణి మహిళ జూనియర్ కళాశాల



క్రమ శిక్షణతో కుటుంబ భారాన్ని , సుఖ సంతోషాలను నడిపే నావ అమ్మ . చిన్నతనంలో మా నాన్న విధి నిర్వహణలో బిజీగా ఉన్న సమయాల్లో మమ్మల్ని అత్యంత సమయపాలనతో మాకు కావలసిన అన్నిటిని సమకూర్చి, సహకరించి, తోడ్పాటు అందించి మా అడుగులను తప్పుదోవలో పడకుండా నడిపించింది అమ్మ సరోజిని . ఆమె చేసిన త్యాగాల ప్రతిఫలమే నేడు కొత్తగూడెం సింగరేణి జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా విధులను 35 ఏళ్ళు పూర్తి చేసుకున్నాను. అమ్మ కోసం... ఆమె చేసిన సేవలు వర్ణింప లేనివి. నా పిల్లల పాఠశాల విద్యను సైతం మా అమ్మనే చూసుకొని నా విధి నిర్వాహణలో ఎంతగానో సహకరించింది. థ్యాంక్యూ అమ్మ.

అమ్మ శ్రమ ఫలితమే హోదాలు

జె. స్వర్ణలత లెనినా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి, భద్రాద్రి



మేము చిన్నతనంలో ఉన్నప్పుడు మా అమ్మ శిరోమణి నిత్యం శ్రమించేది. ఆమె శ్రమకు ఫలితంగా మేము ఈ స్థితిలో ఉండగలుగుతున్నాం. కుట్టు మిషన్ కుట్టి మా నలుగురు తోడ బుట్టువులందరినీ చదువుకోమని ఎంతగానో ప్రోత్సహించింది. ఉన్నత చదువులు పూర్తి చేసుకొని జిల్లా అధికారిగా విధులు నిర్వహిస్తున్నాము. ఉద్యోగులుగా చేసేందుకు కృషి చేసిన అమ్మ రుణం తీర్చుకోలేనిది.

బామ్మ నోట.. నూరేళ్ల మాట

» కుటుంబ సభ్యుల నడుమ జన్మదిన వేడుకలు



యలమద్ది సీతమ్మ జన్మదిన వేడుకల దృశ్యం

చింతకాని మే, 10(ఆంధ్రజ్యోతి): నిండు నూరేళ్ల సంపూర్ణ ఆరోగ్యంతో జీవించిన వాళ్ల చాలా అరుదుగా ఉంటారు. అలా నూరేళ్ల వయసు వచ్చిన సంపూర్ణ ఆరోగ్యంతో జీవిస్తున్న ఓ బామ్మ నాలుగు తరాల మనవలు, మనవరాళ్ల సమక్షంలో ఘనంగా వందేళ్ల పుట్టిన రోజు వేడుకలు జరుపుకొంది. చింతకాని మండలం లచ్చగూడెం గ్రామానికి చెందిన యలమద్ది సీతమ్మ 100వ జన్మదిన వేడుకలను కుటుంబ సభ్యులు బంధుమిత్రులు సమక్షంలో శనివారం ఘనంగా నిర్వహించారు. తన వయసు నూరేళ్లు అంటూ నవ్వుతూ చెప్తున్న బామ్మ నూరేళ్ల వయసులోను ఇతరులపై ఆధారపడకుండా తన పని తాను చేసుకుంటూ ఆరోగ్యంగా జీవిస్తుంది. ఆమెకు ముగ్గురు కుమారులు, ఇద్దరు ఆడపిల్లలు. నాలుగు తరాల కుటుంబ సభ్యులు మనవలు, మనువరాళ్లు, ముని మనవలు, మనవరాళ్లు మొత్తం 25 మంది కుటుంబ సభ్యులు, బంధువుల నడుమ పుట్టినరోజు వేడుకలు కేక్ కట్ చేయించి పండుగ వాతావరణంలో జరుపుకొన్నారు. సమయానికి తింటూ, కష్టపడి పని చేస్తే జీవితాంతం సంపూర్ణ ఆరోగ్యంగా ఉండొచ్చని సీతమ్మ తన అనుభావాలను మనువళ్లు, మనవరాళ్లతో పంచుకున్నారు. కష్టనష్టాల్లోను తమను కంటికిరెప్పలా కాపాడుతూ తమను ఈ స్థాయికి తీసుకొచ్చినందుకు సీతమ్మకు కుమారులు, కూతుర్లు కృతజ్ఞతలు తెలిపారు.

కర్రెగుట్టల నుంచి కేంద్ర బలగాలు వెనక్కి

» ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొనాలని ఆదేశాలు



చర్ల, మే 10 (ఆంధ్రజ్యోతి): గత రెండు సంవత్సరాల నుంచి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బస్తర్ డివిజన్‌లో ఆపరేషన్ కగార్ జరుగుతున్న విషయం తెలిసిందే.. మావోయిస్టుల కోసం కేంద్ర ప్రభుత్వం సీఆర్‌పీఎఫ్, కోబ్రా, బీఎస్‌ఎఫ్ కేంద్ర బలగాలను అడవుల్లోకి పంపింది. అడవుల్లో క్యాంపులు పెట్టి మావోయిస్టుల కోసం కూంబింగ్ నిర్వహిస్తున్నారు. బస్తర్ డివిజన్‌లో ఏడు జిల్లాల్లో సుమారు 30వేలకు పైగా బలగాలు విధులు నిర్వహిస్తున్నారు. గత ఏడాది నుంచి ఇప్పటి వరకు జరిగిన ఎన్‌కౌంటర్‌లో వందల సంఖ్యలో మావోయిస్టులు మృతి చెందారు. ప్రస్తుతం మవోయిస్టులందరు తెలంగాణ - ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని కర్రెగుట్టల మీద ఉన్నట్లు సమాచారం రావడంతో కేంద్ర బలగాలు ఆపరేషన్ కర్రెగుట్టలు పేరుతో గాలింపు చేస్తున్న విషయం తెలిసిందే. సుమారు 288చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న అడవుల్లో 24వేల మంది బలగాలను మోహరించారు. ఇందులో సుమారు 16వేల మంది కేంద్ర బలగాలు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇండియా పాకిస్తాన్ యుద్ధం నేపథ్యంలో కర్రెగుట్టల్లో ఉన్న బలగాలను దేశ సరిహద్దుల్లోకి రావాల్సిందిగా అధికారులు ఆదేశాలు జారీ చేశారు. శనివారం ఉదయం కర్రెగుట్టలు, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ అడవుల్లో డ్యూటీలు చేస్తున్న జవాన్లు దేశ సరిహద్దులోకి బయలు దేరారు. ప్రసుత్తం కర్రెగుట్టల్లో డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్, మహిళా కమాండోస్ ఆపరేషన్ లో పాల్గొంటున్నారు. యుద్ధం ముగిసిన తర్వాత కేంద్ర బలగాలు ఆపరేషన్ కగార్‌లో పాల్గొనే అవకాశం కనిపిస్తోంది.

రైతుల సాగు నీటి కల సాకారం

(5వ పేజీ తరువాయి)



పనులు పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

రఘునాథపాలెం మండల సాగు నీటి కష్టాలను ఎదుర్కొందన్నారు. తిరిగి తనను నమ్మిన మండల ప్రజలు, రైతులకు సాగునీటి కష్టాలు తీర్చాలని మంచుకొండ ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టి కేవలం మూడు నెలల కాలంలోనే పూర్తి చేశామన్నారు.

కేవలం రూ.64కోట్ల వ్యయంతో 36 చెరువులకు సాగర్ జలాలు అందుతున్నాయని తద్వారా 2,400 ఏకరాలకు సాగునీరు అందుతూ నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న రఘునాథపాలెం మండలంలో భూగర్భ జలాలు పెరిగి సస్యశ్యామలంగా మారబోతుందన్నారు. ఖమ్మం ఏఎంసీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, ఆత్మ కమిటీ చైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, సొసైటీ చైర్మన్ తాతా రఘురాం, మండల కాంగ్రెస్ అధ్యక్షులు వాంకుడోత్ దీప్లానాయక్, మాజీ సర్పంచులు తమ్మినేని నాగేశ్వరరావు, దుంపటి నగేశ్, దేవ్‌సింగ్‌నాయక్, బండి వెంకన్న, వాంకుడోత్ విజయ, రామూర్తినాయక్, రామునాయక్, సుధాకర్‌నాయక్, మాజీ ఎంపీటీసీ వెంకన్న, బండి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వేసవి దుక్కులతో..

లాభాలు మెండు



- » లోతు దుక్కులతో చీడపీడల నివారణ
- » వర్షం నీరు లోతుకు చేరే అవకాశం

ఖమ్మం వ్యవసాయం, మే10(ఆంధ్రజ్యోతి): వరుసగా వానకాలం, యాసంగి రెండు పంటలు సాగుచేసిన తర్వాత భూమిలో సారం తగ్గుతుంది. ఆ తర్వాత మరో పంట సాగుచేస్తే దిగుబడి తక్కువగా వస్తుంది. దీని నివారణకు రైతులు వానకాలం పంట వేసే ముందు వేసవిలో దుక్కులు దున్నుకుంటే బహుళ ప్రయోజనాలు ఉంటాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం చాలా మంది రైతులు ట్రాక్టర్లు, ఎడ్లతో తమ పొలాలను దుక్కులు చేసే పనిలో నిమగ్నమయ్యారు. ప్రస్తుత ఎండల తీవ్రతకు భూమి బాగా కాగుతున్నది. దీంతో లోపలి క్రిములు నశించిపోతాయి. పంటలు వేసినప్పుడు క్రిమికీటకాలు బెడద ఉండదు. మందుల పిచికారీ చేయాల్సి ఉంటుంది. వేసవిలో భూమిని దుక్కి దున్నకుండా వదిలేస్తే కలుపు మొక్కలు బాగా పెరుగుతాయి. అవి భూమిలో నీటిని, పోషక పదార్థాలు గ్రహిస్తాయి. దీంతో భూమి లోపలి పొరల నుంచి నీరు ఆవిరై పోతుంది. తద్వారా భూసారం తగ్గుతుంది. దీంతో ఆ తర్వాత పంటలకు అవసరమైన పోషకాలు లభించక ఆశించిన దిగుబడులు రావు. ముఖ్యంగా మార్చి, ఏప్రిల్, మేలో కురిసే అకాల వర్షాలను ఉపయోగించుకొని భూమిని 25-30 సెంటీమీటర్ల లోతులో దుక్కిని చేసుకుంటే మంచి ఫలితాలను పొందవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సూచిస్తున్నారు.

అనేక లాభాలు

వేసవిలోనే భూమిని లోతుగా దున్నడంతో వర్షాకాలంలో తొలకరి వర్షాలు పడగానే నీరు భూమిలోకి ఇంకి భూమి కోతకు గురికాకుండా చేస్తుంది. భూమిని లోతుగా దున్నడంతో భూమిపై పొరలు కిందికి, కిందికి ఉన్న పొరలు పైకి తిరగబడి నేల సారవంతంగా మారుతుంది. భూమిలో తేమశాతం పెరిగి, భూసారం వృద్ధి చెందుతుంది. పురుగులు, తెగుళ్ల, కలుపు నివారణ చేసుకోవచ్చు. దుక్కులు దున్నేముందు పొలంలో గొర్రెలు, మేకలు, పశువుల మందలు తోలడం చేయించాలి. పొలంలో వాటి విసర్జన పదార్థాలు భూమిలో ఇంకి భూసార వృద్ధికి దోహదపడతాయి. వేసవి దుక్కులు దున్నే ముందు పశువుల పెంటపోగు, కంపోస్టు ఎరువులు, చెరువులోని పూడిక మట్టిని వేయడంతో అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంటుంది. పంటలు చేతికి వచ్చే ముందు ఎండు ఆకులు, చెత్త చెదారాన్ని కాల్చివేయకుండా వాటిని పొలంలోనే ఉంచి లోతుగా దుక్కులు చేయడంతో నేల పొరల్లో కలిసిపోయి ఎరువుగా మారుతుంది. తద్వారా భూసారం పెరిగి పంట కు కావాల్సిన పోషక పదార్థాలు పుష్కలంగా లభిస్తాయి. వేసవిలో లోతుగా దున్నడంతో భూమిలో ఉన్న చీడపురుగుల గుడ్లు, లార్వాలను పక్షులు, కొంగలు, కాకులు తిని నాశనం చేస్తుంటాయి. భూమిలో ఉండే శిలీంద్ర బీజా లు మట్టిపైకి రావడంతో అధిక ఉష్ణోగ్రతతో వ్యాధి కలుగజేసే శక్తిని కోల్పోయి పంటలకు తెగుళ్ల సోకుకుండా దోహదపడుతుంది. పంట లు లేని సమయంలో కలుపు మొక్కలు పెరిగి నేలలోని నీరు, పోషక పదార్థాలను గ్రహిస్తాయి. కలుపు మొక్కలు పంటల దిగుబడిని తగ్గిస్తుంటాయి. లోతుగా దున్నడంతో కలుపు మొక్కలు నేలపైకి వచ్చి అధిక ఉష్ణోగ్రతలతో నశిస్తాయి. ఫలితంగా తదుపరి పంటల సాగులో కలుపు మొక్కల తాకిడి బెడద తక్కువగా ఉంటుంది.

దున్నకపోతే నష్టాలే..

యాసంగి పంటల కోతల తర్వాత చాలా మంది రైతులు భూమిని అలాగే వదిలేస్తారు. దీంతో ఖాళీ భూముల్లో కలుపు మొక్కలు, ఇతర గడ్డిజాతి మొక్కలు పెరుగుతాయి. ఇవి భూమిలోని నీటిని, పోషక పదార్థాలను గ్రహించి భూమికి సత్తువ లేకుండా చేసి, భూసారాన్ని తగ్గిస్తాయి. భూమిలోపలి పొరల్లోని నీరు ఆవిరైపోతుంది. వేసవి దుక్కులు లేకుంటే తొలకరి వాననీరు భూమిలోకి ఇంకకుండా పోతుంది. వర్షాలతో భూమి కోతకు గురవుతుంది. ఖాళీ భూముల్లో చీడపురుగులు భారీగా వృద్ధి చెందుతాయి. ఫలితంగా రాబోయే పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది.

వానకాలం, యాసంగి సీజన్‌లలో పంటలు కోసిన తర్వాత తప్పనిసరిగా పొలాన్ని దున్నాలి. వేసవిలో పొలాన్ని దున్నడంతో పంటల దిగుబడికి ఎంతో ఉపయోగపడుతుంది. పంటలకు నాశనం చేసే పురుగులు నాశనమవుతాయి. దుక్కులు చేసే ముందు పశువుల పెంటపోగు,సేంద్రియ ఎరువులను వేస్తే పొలానికి మరింత బలం వస్తుంది.

ఫలితంగా పంటల అధిక దిగుబడికి దోహదపడుతుంది. రైతులు తప్పనిసరిగా వేసవి దుక్కులు చేపట్టాలి

తెలంగాణలో దోపిడీని సాగనివ్వం

(5వ పేజీ తరువాయి)

ఆగిందో చెప్పాలని నిలదీశారు. హైదరాబాదుని అభివృద్ధి చేసి సంపదను పెంచడం ద్వారా రానున్న రోజుల్లో మిగతా హామీలన్నీ అమలు చేసి తీరుతామన్నారు. సంపదను ప్రజలకు పంచే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అందరూ కాపాడుకోవాలని, దోపిడీ చేసిన బీఆర్‌ఎస్‌కు బుద్ధిచెప్పాలన్నారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే ఆదినారాయణ పట్టుదల గల వ్యక్తి అని, సీఎం దగ్గరకు వెళ్లినా, ఏ మంత్రి దగ్గరకు వెళ్లినా నియోజకవర్గ సమస్యలు చెప్పి, దగ్గరుండి నిధులు మంజూరు చేయించుకుంటాడని అభినందించారు.

ఆర్థిక సంక్షోభం ఉన్నా పథకాలు అమలు చేస్తున్నాం: మంత్రి పొంగులేటి

గత పాలకులు చేసిన తప్పిదాల వల్ల ప్రస్తుతం రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నా పేదల కోసం పథకాలను అమలు చేస్తున్నామని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన ఇళ్ల పథకాన్ని తాము సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా తొలివిడతలో 4లక్షల 50 వేల ఇళ్లు మంజూరు చేస్తున్నామన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఐటీడీఏ ద్వారా అదనంగా ఇళ్లు మంజూరు చేసేందుకు ప్రతిపాదనలు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండటం వల్ల దశలవారీగా పథకాలు అమలవుతాయన్నారు. చంద్రుగొండ మండలంలోని వెంగళరావుసాగర్ ప్రాజెక్టు దెబ్బతిని ఎనిమిదేళ్లయినా కనీస మరమ్మతులు చేయలేదని, ఈ ప్రాజెక్టు మరమ్మతుల కోసం తమ ప్రభుత్వం రూ.42కోట్లు మంజూరు చేసిందన్నారు.



డిప్యూటీ సీఎం భట్టితో సంభాషిస్తున్న మంత్రి పొంగులేటి

అశ్వారావుపేట ఎమ్మెల్యే ఆదినారాయణ మాట్లాడుతూ నియోజవర్గాన్ని అన్ని రంగాల్లో ముందు ఉంచేందుకు ఎనలేని కృషిచేస్తున్నానన్నారు. గిరిజన ప్రాంతాల్లో రైతులకు, ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు అడగగానే ఆరు సబ్‌స్టేషన్లు మంజూరు చేయటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అందరి సహకారంతో నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో భద్రాచలం, వైరా ఎమ్మెల్యేలు తెల్లం వెంకటరావు, రాందాస్ నాయక్, ఖమ్మం ఎంపీ రఘురామరెడ్డి, ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయబాబు, ట్రాన్స్‌కో సీఎండీ వరుణ్‌రెడ్డి, రాయల నాగేశ్వరరావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వీ పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ



హాజరైన జిల్లా అధికారులు, నాయకులు

ఉగ్రవాదాన్ని తుద ముట్టించాలి

» నగరపాలక సంస్థ మేయర్ పునుకొల్లు నీరజ

(5వ పేజీ తరువాయి)

చేసుకొని కుయుక్తులు చేసినా వాటిని భారత సైన్యం తిప్పికొట్టిందన్నారు.

భారత సైన్యానికి మద్దతుగా తనతో పాటుగా ఉప మేయర్, 58 మంది కార్పొరేటర్లు ఒక నెల వేతనాలు మొత్తం రూ.5.5 లక్షలు విరాళంగా అందిస్తామని ప్రకటించారు. భారత సైన్యంలో ప్రాణత్యాగం చేసిన ఏపీకి చెందిన మురళినాయక్‌కు ఈ సందర్భంగా నివాళులు అర్పించారు. ఉప మేయర్ ఫాతిమా జోహారా మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్‌కు అన్ని వర్గాల ప్రజల మద్దతు ఉందన్నారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్న మట్టుపెట్టాలని పిలుపునిచ్చారు.

కార్పొరేటర్లు దద్దుకూరి వెంకటేశ్వర్లు, రాపర్తి శరత్‌కుమార్, మలీదు వెంకటేశ్వర్లు, సరిపుడి రమాదేవి, పాకాలపాటి విజయనిర్మల, దండా జ్యోతిరెడ్డి, పల్లెబోయిన భారతి, చిరుమామిళ్ల లక్ష్మీ, దొడ్డా నగేశ్, పగిడిపల్లి రోహిణి, గజ్జల లక్ష్మీ, మదూరి ప్రసాద్, చామకూరి వెంకన్న, తేజావత్ హుస్సేన్, పట్టణ ప్రణాళిక అధికారి గంధం వసుందర, ఉద్యాన అధికారి బెల్లం రాధిక, టీఎంసీ గుడిపుడి సుజాతరాణి, సీవోలు సయ్యద్ సల్మా, గొప్పోజు ఉపేందర్, చిలకా ద్రౌపది, పారిశుద్య పర్యవేక్షకులు సాంబయ్య, ఆర్ఐలు వజ్జా రామారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేయర్ పునుకొల్లు నీరజ

పథకాల అమలులో
నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

» డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి




మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొంగులేటి

అశ్వారావుపేట రూరల్, మే 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేసే ప్రతి సంక్షేమ పథకం ప్రజలకు దరిచేరాలని, పేదలకు పథకాలు అందించేలా చూడటంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై తప్పకుండా చర్యలు ఉంటాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హెచ్చరించారు. ఆరు సబ్‌స్టేషన్లకు శంకుస్థాపన అనంతరం భద్రాద్రి జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర రెవిన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి, అశ్వారావుపేట, భద్రాచలం, వైరా ఎమ్మెల్యేలు జారే ఆదినారాయణ, తెల్లం వెంకట్రావు, రాందాస్ నాయక్‌తో కలిసి జిల్లా అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు.

సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతూ మారుమూల ప్రాంతంలో గిరిజనులు అధికంగా నివసించే అశ్వారావుపేట నియోజకవర్గ అభివృద్ధికి కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో ప్రతి కుటుంబానికి తీసుకెళ్లగలిగితే ప్రభుత్వం విజయం సాధించినట్టేనన్నారు. ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లటంలో నిర్లక్ష్యం వహిస్తే మొహమాటం లేకుండా కఠిన నిర్ణయాలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉద్యోగుల సమస్యలను కూడా రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలనే ఆలోచనలో ఉందన్నారు. అధికారుల భాగస్వామ్యంతోనే పాలన ప్రజలకు అందుతుందని, పాలన అందించలేనప్పుడు ప్రజాస్వామ్యానికి అర్థం లేదన్నారు.

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడి 16నెలలైనా కొందరు అధికారులు ఇంకా ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా పనిచేయడం లేదన్నారు. ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా సామాన్య ప్రజలు, గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, ఐటీడీఏ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రభుత్వ ఆలోచనలను క్షేత్రస్థాయిలో తీసుకెళ్లే బాధ్యత అధికారులు, ఉద్యోగులపైనే ఉందన్నారు. కమలాపురం, అంకంపాలెంలో సబ్‌స్టేషన్లు మంజూరు చేస్తే విద్యుత్‌కు ఎటువంటి అంతరాయం ఉండదని అధికారులు తెలపగా స్పందించిన డిప్యూటీ సీఎం వెంటనే సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు, అశ్వారావుపేటలో డివిజన్ విద్యుత్‌శాఖ కార్యాలయ ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాలని సీఎండీ వరుణ్‌రెడ్డిని ఆదేశించారు. సమావేశంలో కలెక్టర్ జితేశ్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు, అధికారులు పాల్గొన్నారు.

అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల వార్షికోత్సవం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

అశ్వారావుపేట రూరల్, మే 10(ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల 34వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం రాత్రి అట్టహాసంగా జరిగాయి. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ రవి హైబ్రీడ్ సీడ్స్ అధినేత మన్నెపల్లి రవి, ఇండీస్ కంపెనీ అధినేత, పూర్వ విద్యార్థి నరేంద్ర దత్తులు మాట్లాడారు. అనంతరం కళాశాల విద్యార్థులు ఆటపాటలతో నృత్యాలు చేసి అలరించారు. కార్యక్రమంలో కళాశాల శాస్త్రవేత్తలు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సెలవుల్లో.. నటనలో ఓనమాలు

» ఔత్సాహికులకు నటనలో శిక్షణ

» పునాది వేస్తున్న థియేటర్ యాక్టింగ్ వర్క్‌షాప్



గుంతేటి చిన్నా.. ఇన్‌స్ట్రక్టర్

ఖమ్మం సాంస్కృతికం, మే 10 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరానికి చెందిన పలువురు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేందుకు నటన శిక్షణను ఎంచుకున్నారు. తమ రోజువారి జీవితాలకు భిన్న పాత్రల్లో జీవిస్తున్నారు. దొరలుగా, పాలేర్లుగా, జమిందార్లుగా, పోలీసులుగా, వీర వనితలుగా, దాసీలుగా ఇలా గత సమాజంలో అంతర్భాగమైన పలు పాత్రల్లో లీనమవుతున్నారు. ఖమ్మంలోని ఎన్నెస్పీ క్యాంపులో గల బాలుర వసతి గృహంలో గత ఇరవై రోజులుగా కొనసాగుతున్న థియేటర్ వర్క్‌షాప్‌లో చేరిన పలువురు తమలోని నటనకు పునాది వేసుకుంటుండగా.. మరికొందరు శాస్త్రీయ విధానంలో నటనకు శ్రీకారం చుట్టుకుంటున్నారు. సినిమాలు, టీవీలు, వెబ్ సిరీస్ తదితర మాధ్యమాలలో నటనకు థియేటర్ కళాకారులకు ప్రాధాన్యం ఇస్తుండటంతో ఈ వర్క్‌షాప్‌కు ఆదరణ లభిస్తోంది. థియేటర్ యాక్టింగ్ వల్ల నటనలో పరిపక్వత సంతరించుకోనుండటంతో నటనపై ఆసక్తి ఉన్న వారు ఈ శిక్షణ శిబిరానికి వస్తున్నారు.

రంగస్థలం నటనకు మూలాధారం.. నటనలో సహజత్వం, గాత్రంలో స్పష్టత, ముఖ కవళికలు, ఆహార్యం, తదితర నటనకు సంబంధించిన అన్ని విభాగాలకు రంగస్థలం వేదిక ప్రాణ సమానం. మరుగునపడిన రంగస్థలానికి ఆధునిక రూపం థియేటర్ యాక్టింగ్. హైదరాబాద్, ముంబై లాంటి పెద్ద నగరాలకే పరిమితమైన థియేటర్ యాక్టింగ్ శిక్షణ ఖమ్మం నగరానికి అందుబాటులో రావటంతో పలువురు ఔత్సాహికులు నటనకు సంబంధించి ఓనమాలు దిద్దుకుంటున్నారు. ఈ వర్క్‌షాప్‌లో శిక్షణ ఉచితంగా అందిస్తుండటంతో పిల్లలు, పెద్దలు, మహిళలు వయో, లింగ భేదాలు లేకుండా శిక్షణకు హాజరవుతున్నారు. 45 రోజుల ఈ వర్క్‌షాప్‌లో ఔత్సాహికులకు నటనకు సంబంధించిన ప్రాథమిక అంశాలను బోధిస్తారు. శిక్షణ థియరీ, ప్రాక్టికల్ విభాగాలుగా ఉంటుంది. పాత్రల తీరుతెన్నులు, హావభావాలు, గాత్రధర్మాలను వివరించటం, పాత్రలకు సంబంధించిన డైలాగులను బోధిస్తారు. ఆ తరువాత వాటిని బృందాలుగా ప్రదర్శిస్తారు. శిక్షణలో భాగంగా పలు అంశాలకు సంబంధించిన స్కిట్లను రూపొందించి శిక్షణనిస్తున్నారు. ప్రతిరోజు సాయంత్రం 4 గంటల నుంచి 7గంటల వరకు ఈ శిక్షణ ఎన్నెస్పీ క్యాంపులోని బాలుర వసతి గృహంలో కొనసాగుతోంది. శిక్షణ అనంతరం విద్యార్థుల నటనా కౌశలాన్ని ప్రదర్శించేందుకు వీలుగా స్టేజ్ ప్లేను నిర్వహించనున్నారు.



శిక్షణ పొందుతున్న దృశ్యం



శిక్షణ పొందుతున్న ఔత్సాహికులు

నేర్చుకున్న విద్యను పంచేందుకే...: గుంతేటి చిన్న ఇన్‌స్ట్రక్టర్...

మాది కల్లూరు మండలం చెన్నారం. నేను తెలుగు యూనివర్సిటీ ద్వారా నట శిక్షణ పొందా. టీవీ షోలు, సీరియల్స్, సినిమాల్లో నటించే పిల్లలకు, పెద్దలకు శిక్షణ ఇస్తుంటా. నేను నేర్చుకున్న విద్యను ఔత్సాహికులకు పంచాలన్న ఉద్దేశ్యంతో ఇలా ఉచిత వర్క్‌షాప్ నిర్వహిస్తుంటా. నేను నట శిక్షణ పొందాలని భావించిన రోజుల్లో అవకాశాలు స్థానికంగా అందుబాటులో లేవు. నేను స్థానికంగా వర్క్‌షాప్ ఏర్పాటుచేసి ఆ లోటు తీర్చాలని భావించా.

ఆటో కార్మికులను మోసగించిన కాంగ్రెస్ సర్కార్

» కార్మికసంఘం రాష్ట్ర జేఏసీ అధ్యక్షుడు మందా రవికుమార్



సమావేశంలో మాట్లాడుతున్న మందా రవికుమార్

జూలూరుపాడు, మే 10(ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు ఆటో కార్మికులకు అనేక వాగ్దానాలను ఇచ్చి అధికారంలోకి వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిన్నర గడిచిన కార్మికులకు ఇచ్చిన హామీలను నేరవేర్చకుండా మోసగించిందని ఆటో కార్మికసంఘం రాష్ట్ర జేఏసీ అధ్యక్షుడు మందా రవికుమార్ అన్నారు. ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణమే నేరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఆటో కార్మికసంఘం జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రథయాత్ర శనివారం జూలూరుపాడుకు చేరుకుంది. ఈ సందర్భంగా టీఏడీయూ సంఘానికి చెందిన ఆటో కార్మికులు రథయాత్రకు స్వాగతం పలికి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు ఇచ్చిన హామీలను నేరవేర్చాలని కోరుతూ ఏప్రిల్ 25న మెదక్ జిల్లా నర్సాపూర్‌లో రథయాత్రను ప్రారంభించడం జరిగిందని, 32 రోజుల పాటు 100 నియోజకవర్గాలలో ఈ రథయాత్రను కొనసాగించి ఈ నెల 27వ తేదీన యాత్ర ముగింపు సందర్భంగా హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద ఆటో ఆకలి కేకలు సభను నిర్వహించటం జరుగుతుందని అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మీ పథకాన్ని ప్రవేశపెట్టి ఆటో కార్మికుల పొట్ట కొట్టిందన్నారు. ఆటో కార్మికుల ఆత్మహత్యలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికులకు ఏడాదికి రూ. 12వేల ఆర్థిక సహాయం అందించడంతో పాటు ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డును ఏర్పాటుచేసి సామాజిక భద్రతను కల్పిస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు నేరవేర్చకపోవడం తగదన్నారు. కార్మికులకి ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేయాలని లేకుంటే మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిపిడీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఐబి.చారీ, సంఘం మండల అధ్యక్షుడు బానోత్ నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు మురళీ కృష్ణ, కోశాధికారి నరేష్, నాయకులు బానోత్ బద్యా, బానోత్ వీరునాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

విషాహారం తిని వ్యక్తి ఆత్మహత్య

ఖమ్మం రూరల్, మే10(ఆంధ్రజ్యోతి): విషాహారం తిని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ముత్తగూడెం గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముత్తగూడెం గ్రామానికి చెందిన చెరుకుపల్లి నాగేశ్వరరావు (41) ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా నాగేశ్వరరావు అనారోగ్యంతో బాధపడుతూ ఇంట్లోనే ఉంటున్నాడు. అనారోగ్యబాధలు భరించలేక శనివారం ఇంట్లో ఉన్న ఎలుకల మందు పేస్టు తిన్నాడు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియచేయడంతో వెంటనే అతడిని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నాగేశ్వరరావు ఆదివారం మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో ఉపాధిహామీ కూలీ మృతి



బ్రహ్మారెడ్డి(ఫైల్)

పినపాక, 10 మే (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో ఉపాధి హామీ కూలీ మృతి చెందిన ఘటన శనివారం మండలంలోని ఏడూళ్లబయ్యారం గ్రామంలో జరిగింది. మండలంలోని ఏడూళ్లబయ్యారం గ్రామానికి చెందిన కీస ర పెద్ద బ్రహ్మారెడ్డి (59)ఎప్పటిలానే శనివారం ఉదయం పెంటన్నగూడెం గ్రామంలో జరుగుతున్న ఎన్ఆర్‌ఈజీఎస్ ఉపాధి హామీ పనులకు వెళ్లాడు. ఈ క్రమంలో బ్రహ్మారెడ్డికి ఛాతిలో తీవ్ర నొప్పి వస్తుందని చెప్పి కుప్పకూలడంతో, అక్కడే ఉన్న, తోటి కూలీలు కుటుంబ సభ్యులకు, ఎన్ఆర్‌ఈజీఎస్ సిబ్బందికి సమాచారమిచ్చారు. కుటుంబ సభ్యులు వెంటనే మణుగూరు 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్య సిబ్బంది అతడిని పరీక్షిస్తుండగా మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి కుమారుడు సుధాకర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు.


మంటలంటుకొని వృద్ధురాలు...

సత్తుపల్లిరూరల్, మే10 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ మంటలంటుకుని వృద్ధురాలు మృతిచెందిన సంఘటన సత్తుపల్లి మండలం తుంబూరులో శనివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఓరుగంటి నాగేశ్వరమ్మ (74) తన వరిపొలాన్ని నారుమడికి సిద్ధం చేస్తుంది. ఈ క్రమంలో గడ్డిని తొలగించేందుకు నిప్పుపెట్టగా మంటలతో పాటు పొగ దట్టంగా వ్యాపించింది. అదేవిధంగా ఎండ తీవ్రతతో పాటు పొగ, మంట ఆవిరికి తీవ్ర అస్వస్థతకు గురైన నాగేశ్వరమ్మ కళ్లుతిరిగి కిందపడిపోయింది. ఈ క్రమంలో మంటలు వ్యాపించి ఆమెకు అంటుకోవడంతో గమనించిన పక్క పొలం రైతు శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు తెలియజేశాడు. ఆమె అప్పటికే మృతిచెందగా సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం సత్తుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి భర్త, కుమార్తె ఉన్నారు.

కేశ్వాపురంలో చైన్ స్నాచింగ్

కూసుమంచి, మే 10(ఆంధ్రజ్యోతి): కూసుమంచి మండలం కేశ్వాపురం గ్రామంలో శనివారం చైన్‌స్నాచింగ్ సంఘటన చోటుచేసుకుంది. గుర్తు తెలియని దుండగులు ఓవృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును లాక్కుని ఎత్తుకెళ్లారు. గ్రామానికి చెందిన బెల్లం సత్యమయ్య సతీమణి సావిత్రి అనే మహిళ రోడ్డు వెంట ఉన్న తన ఇంటిముందు నిల్చుని ఉంది. ఈక్రమంలో ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి మంచినీళ్లు అడిగారు. మహిళ ఇంట్లోకి వెళ్లేందుకు తిరిగిన వెంటనే దుండగులు వెనుక నుంచి చైన్ లాక్కొన్నారు. వెంటనే బాధిత మహిళ కేకలు వేయడంతో బైక్‌పై వచ్చిన దుండగులు ఖమ్మంవైపు పరారైనట్లు బాధితులు తెలిపారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే ఎస్ఐ నాగరాజు సిబ్బందితో కలిసి దుండగుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. బంగారం ఖరీదు సుమారు రూ.50వేల వరకు ఉంటుందని పేర్కొన్నారు.

కుటుంబ సభ్యులకు వ్యక్తి అప్పగింత



కుటుంబ సభ్యులకు ప్రవీణ్‌ను అప్పగిస్తున్న దృశ్యం

ఖమ్మం ఖానాపురంహవేలి, మే 10(ఆంధ్రజ్యోతి): నగరంలోని అన్నం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఓ వ్యక్తిని కుటుంబ సభ్యులకు అప్పగించిన అన్నం శ్రీనివాసరావు. తొమ్మిది నెలల క్రితం గుర్తు తెలియని (40) వ్యక్తి నగరంలోని వైరా రోడ్‌లో మతిస్థిమితం కోల్పోయి రోడ్లపై తిరుగుతుండగా స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఆ వ్యక్తిని నగరంలోని అన్నం ఫౌండేషన్‌కు తరలించారు. వైద్యసేవల అనంతరం ఆ వ్యక్తి కోలుకొని వివరాలు వెల్లడించారు. నా పేరు కాలేరు ప్రవీణ్, మాది మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం చెట్ల ముప్పారం గ్రామం అని తెలిపాడు. అమ్మ పేరు విజయలక్ష్మి, ముగ్గురు అక్కలు ఉన్నట్లు తెలిపాడని అన్నం శ్రీనివాసరావు తెలిపారు. శనివారం అన్నం ఫౌండేషన్ ఆధ్వర్యంలో చెట్ల ముప్పారంలోని ప్రవీణ్ ఇంటికి తీసుకెళ్లి కుటుంబ సభ్యులకు అప్పగించామని పేర్కొన్నారు.

మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులను డీఈవో కార్యాలయానికి పంపాలని వినతి

ఖమ్మం ఖానాపురంహవేలి, మే 10(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల స్క్రూట్నీని ఆలస్యం చేయకుండా వెంటనే జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి సకాలంలో అందించాలని టీపీటీఎఫ్ నాయకులు కోరారు. శనివారం సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా మెడికల్ బోర్డు సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి విజయ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంగళరావు తదితరులున్నారు.

అమరవీరులకు మంత్రుల సంతాపం



అమరవీరులకు సంతాపంగా మౌనం పాటిస్తున్న డిప్యూటీ సీఎం, మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యేలు

అశ్వారావుపేట రూరల్, మే 10(ఆంధ్రజ్యోతి): భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధం నేపథ్యంలో అమర వీరులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు సంతాపం తెలిపారు. అశ్వారావుపేటలో శనివారం జరిగిన కార్యక్రమం సందర్భంగా యుద్ధంలో అమరులైన వారికి సంతాపంగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు జారే ఆదినారాయణ, తెల్లం వెంకట్రావు, రాందాస్‌నాయక్, కలెక్టర్ జితేశ్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు, సీఎండీ వరుణ్‌రెడ్డి ఉన్నారు.

పాకిస్థాన్ ఖబడ్దార్ పాటల సీడీ ఆవిష్కరణ

చుంచుపల్లి, మే10(ఆంధ్రజ్యోతి): భారత్- పాకిస్తాన్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధాన్ని ...విపత్కర పరిస్థితిలో ఉన్న దేశం కోసం భద్రాద్రి జిల్లా కళాకారులు, కవులు ఆధ్వర్యంలో రూపొందించిన పాకిస్తాన్ కబడ్దార్ పాటల సిడిని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి శనివారం ఆవిష్కరించారు. భద్రాద్రి జిల్లా పర్యటనకు విచ్చేసిన డిప్యూటీ సీఎం భట్టిని డాక్టర్ మద్దెల శివకుమార్ స్వయంగా కలిసి ఆ పాటల సిడి విశేషాలను వివరించారు. స్వీయ రచన, గానం, సమర్పణలో ఈ పాటల సిడిలో పాకిస్థాన్ ఉగ్రవాదంపై గీతాన్ని పొందుపరిచినట్లు తెలిపారు. ఈ ఆవిష్కరణలో ఎమ్మెల్యేలు జారే ఆదినారాయణ, మాలోత్ రాందాస్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఆంథోటి పాల్, కోటేశ్వరరావు, అంబేద్కర్ యువజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దెల సాయిసుధీర్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్ విజయాన్ని కాంక్షిస్తూ భద్రాచలంలో పూజలు



సుదర్శన హోమంలో పాల్గొన్న ఈవో,ఎస్ఐ

భద్రాచలం, మే 10: ఆపరేషన్ సిందూర్ విజయాన్ని కాంక్షిస్తూ....ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో దేవస్థానం ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారత్‌లో శాంతి స్థాపనకు త్రివిధ దళాలు కృషి చేస్తున్న క్రమంలో ఆ ప్రయత్నాలు సఫలం కావాలని పూజలు నిర్వహించారు. అలాగే భద్రాద్రి రామయ్యకు నిత్యం నిర్వహించే కల్యాణంలో సైతం దేశం సుభిక్షంగా ఉండాలని పూజలు నిర్వహించారు. ఇందులో పాల్గొన్న భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్. రమాదేవి మాట్లాడుతూ రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు భద్రాద్రి రామాలయంలో దేశం సుభిక్షంగా ఉండాలని ప్రజలు క్షేమంగా ఉండాలని కోరుకుంటూ పూజలు నిర్వహించినట్లు తెలిపారు. భద్రాద్రి దేవస్థానం ప్రధాన అర్చకులు కోటి రామస్వరూప్ రాఘవచార్య, రామాయణ పారాయణదారు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు మాట్లాడుతూ భారత సైనికులు క్షేమంగా ఉండాలని పూజలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ స్వప్న, వైదిక పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు.

భారత సైనిక బలగాల నిధికి ఎమ్మెల్యే పాయం విరాళం



మణుగూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): తమ ప్రాణాలను ఫణంగా పెట్టి దేశ సరిహద్దుల్లో శత్రుదేశాలను అడుగు పెట్టకుండా ఉగ్రవాదాన్ని నిర్మూలించచడంలో వీరోచితంగా పోరాడుతున్న భారత సాయుధ ధళాలకు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తన ఒక నెల వేతనాన్ని విరాళంగా ప్రకటించారు. జాతీయ రక్షణ నిధికి ఈ మొత్తాన్ని విరాళంగా అందిస్తున్నానని ప్రకటించారు.

సైన్యానికి సంఘీభావంగా ర్యాలీ

ఖమ్మం గాంధీ చౌక్, మే 10(ఆంధ్రజ్యోతి): పాకిస్తాన్ ఉగ్రదాడులకు నిరసనగా వీరోచిత పోరాటం చేస్తున్న మన భారత సైన్యానికి మద్దతుగా శనివారం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ నుంచి గాంధీ చౌక్ వరకు సంఘీభావ ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మెంతుల శ్రీశైలం ,సహాయ కార్యదర్శి మన్నెం కృష్ణయ్య , మిర్చిశాఖ అధ్యక్షుడు మాటేటి నాగేశ్వరరావు ,కార్యదర్శి యడ్లపల్లి సతీష్ కుమార్ ,కోల్డ్ స్టోరేజి శాఖ అధ్యక్షులు మాలిశెట్టి వెంకటేశ్వర్లు, సెంట్రల్ ఈసీ సభ్యులు పాయల నాగేశ్వరారావు, నేరెళ్ల శేషగిరి రావు, జనరల్ కార్యవర్గ సభ్యులు రంగా భాస్కర్ రావు, జంగిలి రమణ బండి సతీష్ గారు, సారిక పాపారావు గారు, సిరికొండ వెంకటేశ్వర్లు , తూములూరి లక్ష్మీనరసింహారావు గారు, తదితర సభ్యులు పాల్గొన్నారు



ఛాంబర్ సభ్యుల సంఘీభావ ప్రదర్శన

3.5 కిలోల ఎండు గంజాయి పట్టివేత



స్వాధీనం చేసుకున్న ఎండు గంజాయితో సీఐ కృష్ణ

ఖమ్మం సంక్షేమ విభాగం, మే 10(ఆంధ్రజ్యోతి): అక్రమంగా రవాణా జరుగుతున్న ఎండు గంజాయిని ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. ఖమ్మం వన్‌టౌన్ ఎక్సైజ్ హౌజ్ ఆఫీసర్ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. దంతేవాడ ప్రాంతం నుంచి ఇద్దరు వ్యక్తులు హైదరాబాద్‌కు 3.5 కేజీల ఎండు గంజాయిని శనివారం ఆర్టీసీ బస్సులో రవా ణా చేస్తున్నారు. సమాచారం మేరకు బస్సులో సోదాలు నిర్వహించగా ఎండు గంజాయి లభ్యమైందని తెలిపారు. వెంటనే గంజాయితో పాటుగా ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకొని రిమాండ్ చేసినట్లు సీఐ కృష్ణ తెలిపారు.

విదేశీ విద్యపై అవగాహన

ఖమ్మం ఖానాపురంహవేలి, మే 10(ఆంధ్రజ్యోతి): విదేశీ విద్యపై శనివారం నగరంలోని పీఆర్‌టీయూ జిల్లా కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. 30 దేశాలలో విద్య, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, యూనివర్సిటీలలో అడ్మిషన్లు ఎలా పొందాలి, అర్హతలు, తదితర అంశాలను విద్యార్థులకు వారి తల్లితండ్రులకు కల్పించారు. రాజ్ ఏబ్రాడ్ స్టడీ కన్సల్టెన్సీ ఆధ్వర్యంలో ఈ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది. వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి రంగారావు, విజయ్, శేఖర్ పాల్గొన్నారు.

వైరాలో వరుస దొంగతనాలు

వైరా, మే 10 (ఆంధ్రజ్యోతి): వైరాలోని పాత బస్టాండ్ సెంటర్లో శుక్రవా రం అర్ధరాత్రి జాతీయ ప్రధాన రహదారి పక్కన గాంధీచౌక్‌లో ఉన్న ఆరు దుకాణాల్లో వరుస చోరీలు జరిగాయి. జాతీయ ప్రధాన రహదారిలో ఉన్న ఒక బేకరీ, రెండు కిరాణా దుకాణాలు, గాంధీ చౌక్‌లోని ఒక రైస్ డిపో, రెండు సెల్‌ఫాయింట్ల షట్టర్ల తాళాలు పగులగొట్టి ఈ చోరీలకు పాల్పడ్డారు. రైస్ డిపోలో కొంతమొత్తం చిల్లర, కిరాణ దుకాణాల్లో కొన్ని వేల రూపాయల నగదు, రెండు సెల్ ఫాయింట్లలో 20పాత సెల్‌ఫోన్లను అపహరించుకుపోయారు. తెల్లవారుజామున గాంధీచౌక్ కాంప్లెక్స్‌లోని జాతీయ ప్రధాన రహదారి ముందున్న టీస్టాల్ షట్టర్ తాళాలను అగంతకులు పగులగొడుతుండగా, టీస్టాల్‌ను తెరిచేందుకు వచ్చిన నిర్వాహకుడు కేకలు వేయడంతో జాతీయ ప్రధాన రహదారి పక్కన రెండోవైపు నిలిపిఉంచిన ఆటోలో దొంగలు పరారయ్యారు. ఖమ్మం నుంచి క్లూస్‌టీం వచ్చి వేలిముద్రలు సేకరించింది. వైరా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



షట్టర్ తాళాలు పగులగొట్టిన దృశ్యం

పీవీరావుకు ఘన నివాళి

ఖమ్మంచర్చికాంపౌండ్, మే10(ఆంధ్రజ్యోతి): మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పీవీ రావు జయంతి సందర్భంగా శనివారం నివాళి అర్పించారు. ఖమ్మం నగరంలోని అంబేద్కర్ భవన్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా మాలమహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి ముడుసు జాకప్‌ప్రతాప్, జిల్లా ప్రధాన కార్యదర్శి పేరం మల్లయ్య మాట్లాడారు. బోధించు, సమీకరించు, పోరాడు అనే అనేమార్గంలో మాలమహానాడును స్థాపించి చివరి శ్వాసవరకు దళిత, బహుజన ఐక్యత, హక్కుల కోసం నిరంతరం కృషిచేసిన పోరాటయోధుడు పీవీ రావు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కొర్లపాటి చిరంజీవి, కొరివి దయానంద్, కొరివి భాస్కర్, తలారి రాధాకృష్ణ పాల్గొన్నారు.



స్థంభాద్రి లక్ష్మీ నరసింహాస్వామి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఘనంగా సుదర్శన యాగం

ఖమ్మంఖానాపురంహవేలి, మే10 (ఆంధ్రజ్యోతి): స్థంభాద్రి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో వార్షిక పంచాహ్నిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం ఆలయంలో సుదర్శన యాగం నిర్వహించారు. పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో జగన్‌మోహన్‌రావు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు నరహరి నర్సింహాచార్యులు, రామకృష్ణాచార్యులు, శ్రీనివాసచార్యులు ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చిమ్మపుడిలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం



రఘునాథపాలెం, మే 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిమ్మపుడి గ్రామంలోని శ్రీలక్ష్మి నరసింహస్వామి దేవాలయంలో శనివారం 15వవార్షిక బ్రహోత్సవాలు ప్రారంభం అయ్యాయి. ప్రధానార్చకుడు మురళీధరాచార్యులు, అర్చకులు రవికిరణ్ చార్యులు, రంజిత్‌చార్యులు క్రతువును శాస్త్రయుక్తంగా ప్రారంభించారు. ఉత్సవాలు 14వ తేదీ వరకు జరుగనున్నాయి. 12నరాత్రి స్వామివారి తిరుకల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

గోల్‌తండాలో ఘనంగా నాభిశిల ప్రతిష్ఠ

తిరుమలాయపాలెం, మే10(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోల్‌తండాలో (నాభిశిల) ద్వితీయ సంవత్సర వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆత్మకమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ, ఏఎంసీ డైరెక్టర్ జడల నగేష్, కాంగ్రెస్ నాయకులు చీకటి శ్రీను, బానోతు శివాజి, ఎస్‌డీ సైదా, మదార్, బానోతు రంగా తదితరులు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న శివరామకృష్ణ

అభయమిస్తూ... ఆదేశిస్తూ..





గిరిజన మహిళా రైతులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల, ఇరిగేషన్, వ్యవసాయశాఖ అధికారులకు సూచనలు ఇస్తున్న మంత్రి

- మండుటెండల్లో మంత్రి తుమ్మల పర్యటన
- మూడు రోజుల్లో చెరువులకు నీరు చేరాలని ఆదేశాలు

రఘునాథపాలెం, మే10(ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆపర భగీరథుడులా రఘునాథపాలెం మండలంలోని చెర్వులు,వ్యవసాయ భూములు కాల్వల వెంట తిరిగారు. మంచుకొండ ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించారు. రేగులకుంట చెర్వు వద్దకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేరుకోగానే గిరిజన మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. తమ చెర్వులు నీళ్ల లేక ఎండిపోయాయని, గత ప్రభుత్వంలో పుడికతీసి వదిలేస్తే ఇప్పుడు నీటితో నిండిపోయాయని, తమకు వ్యవసాయంతో పాటుగా పశువులకు సంవృద్ధిగా నీరు అందుతుందని హర్షం వ్యక్తం చేశారు. స్పందించిన మంత్రి తుమ్మల వారి వద్దకు వెళ్లి గిరిజన రైతుల బాగోగులు తెలుసుకున్నారు. చెరువు వద్ద కాంగ్రెస్ నాయకులతో మంత్రి మాట్లాడుతూ ఒక చెరువు నుంచి మరో చెరువునకు అనుసంధానం జరిగి ఉండన్నారు. మస్తానీ కుంటకు మూడురోజుల్లో సాగర్ జలాలు అందాలని, వ్యవసాయ భూముల్లో నుంచి కాల్వలు తీయటంతో రైతులకు ఇబ్బంది ఏర్పడుతుందని వెంటనే కాల్వల్లోకి పైపులు వేసి పూడ్చాలని ఆదేశించారు. ఇలా గిరిజన రైతులకు అభయమిస్తూ... వివిధ అధికారులను ఆదేశిస్తూ తుమ్మల నాగేశ్వరరావు సాగింది.

ప్రజా సమస్యలపై 17న కేఎంసీ ముట్టడి

సీపీఎం డివిజన్ కార్యదర్శి విక్రమ్

ఖమ్మంసంక్షేమ విభాగం, మే10 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని ప్రధాన సమస్యల పరిష్కారానికి ఈనెల 17న ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తామని సీపీఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్ హెచ్చరించారు. శనివారం సుందరయ్య భవన్‌లో జరిగిన డివిజన్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. కొన్ని ప్రాంతాల్లో అంతర్గత రహదారులు వెడల్పు చేయాలని డిమాండ్ చేశారు. నూతనంగా రేషన్ కార్డులు, చేయూత పింఛన్లు, ఇంటి స్థలాలు ఇవ్వాలని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంచేయాలని ప్రదానమైన సమస్యలపై కేఎంసీ ముట్టడి కార్యక్రమం చేపడ్తామని ప్రకటించారు. ఈ సమావేశంలో నాయకులు ఎస్కే మీరా, ఉపేందర్, కృష్ణయ్య, నాగేశ్వరరావు, జనార్ధన్, వెంకన్న, మధు, జాన్‌బీ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపై ప్రచారం



సంతలో ప్రచారం చేస్తున్న దృశ్యం

తిరుమలాయపాలెం, మే10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిండిప్రోలులో మాదక ద్రవ్యాల అనర్ధాలపై సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం గోరింట్ల జిల్లాపరిషత్ పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్ ప్రచారం చేపట్టారు. శనివారం పిండిప్రోలులో వారంతపు సంతలో మాదకద్రవ్యాల అనర్థాలపై ఫ్లెక్సీలు, కరపత్రాలతో ప్రచారం చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు తతాతా రవీందర్, శోంటి కృష్ణ, పాల్గొన్నారు.

జమలాపురం శ్రీవారికి సర్వాంగాభిషేకం

ఎర్రుపాలెం,మే10(ఆంధ్రజ్యోతి): మండలంలోని తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారికి శనివారం సర్వాంగాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో పంచామృతాలు, సుగంధద్రవ్యాలతో సర్వాంగాభిషేకం నిర్వహించి ముత్యాల అలంకారంలో భక్తులకు దర్శనం కలిపించారు.శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారి ఉత్సవాలను పల్లకీలో ఊరేగించి కల్యాణ వేదిక వద్దకు చేర్చి నిత్యకళ్యాణం నిర్వహించారు. భక్తులు నూతన వాహనాలకు పూజాది కార్యక్రమాలు నిర్వహించుకుని తమ నూతన వాహనాలతో గిరి ప్రదక్షిణలు చేశారు. శ్రీవారి ఆలయంతోపాటు భక్తులు ఉపాలయాలను దర్శించుకున్నారు.

నగరానికి మొక్కల అందాలు.. కేఎంసీలో ఖాళీ కుండీలు

ఖమ్మంసంక్షేమవిభాగం, మే10(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని డివైడర్లు నుంచి పార్కుల వరకు అందమైన పూల మొక్కలను నాటుతూ వాటిని రక్షిస్తున్న కేఎంసీ ఉద్యాన విభాగం అధికారులు ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంపై మాత్రం వివక్ష చూపుతున్నారు. కేఎంసీఅధికారుల విభాగాల నుంచి ఉద్యాన అధికారుల విభాగాల వరకు గతంలో మొక్కల కోసం కుండీలు ఏర్పాటు చేశారు. ఐనప్పటికీ కనీసం ఏదోఒక మొక్కను నాటలేక పోతున్నారు. దీంతో కమిషనర్ ఛాంబర్ వద్ద మొక్కల కుండీలు మూలకు చేరటంతో కేఎంసీలోని ఎగ్జామినర్ అధికారి కుండీలను తన చాంబర్‌లోకి తీసుకెళ్లారు. వివాదం ఏర్పడటంతో తిరిగి కమిషనర్ చాంబర్‌కు తీసుకొచ్చి పెట్టారు. కానీ ఉద్యాన అధికారులు మాత్రం ఖాళీ కుండీల్లో మొక్కలను మాత్రం నాటటం లేదు.



కమిషనర్ చాంబర్ వద్ద ఖాళీగా మూలన పడేసిన కుండీలు

వీరజవాన్ మురళీనాయక్‌కు నివాళులు



వీరజవాన్‌కు మౌనం పాటిస్తూ నివాళులర్పిస్తున్న ఉపాధి హామీ కూలీలు

ఏన్కూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): యుద్ధ భూమిలో వీరమరణం పొందిన జవాన్ మురళీ నాయక్‌కు శనివారం తూతక్కలింగన్నపేట గ్రామానికి చెందిన ఉపాధి హామీకూలీలు మౌనం పాటిస్తూ నివాళులర్పించారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం విరామం లేకుండా పోరాడుతున్న భారత సైన్యానికి మద్దతు ప్రకించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ రాణి, ఉపాధి హామీకూలీలు పాల్గొన్నారు.

కారేపల్లి: ఆపరేషన్ సిందూర్‌కు ఉపాధి హామీ కూలీలు సంఘీభావం తెలిపారు.శనివారం మండల పరిధిలోని మాణిక్యారంలో ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్న వందలాదిమంది కూలీలు పనిప్రదేశంలో జాతీయ జెండా చేతపట్టిముందుగ సంఘీబావం ప్రకటించారు.అనంతరం దాడులలో వీరమరణం పొందిన అమరజావాన్లకు రెంఉ నిమిషాలు మౌనంపాటించి, జోహర్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో అనేకమంది పాల్గొన్నారు.

సీతారామ ప్రాజెక్టు కెనాల్‌ను పాలేరుకు అనుసంధానం చేయాలి

బోనకల్,మే10(ఆంధ్రజ్యోతి): సీతారామ ప్రాజెక్టు కెనాల్‌ను పాలేరు జలాశయానికి అనుసంధానం చేయాలని తెలంగాణ రైతు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. మండలంలోని ముష్టికుంట్లలో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సీతారామ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం సమకూర్చడం లేదన్నారు. భద్రాద్రి జిల్లాలో వినోభనగర్ వద్ద 17నెలల నుంచి పనులు నిలిచిపోయినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

యర్రగర్లకు మంత్రి తుమ్మల పరామర్శ

రఘునాథపాలెం, మే10(ఆంధ్రజ్యోతి): ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు కుటుంబ సభ్యులను వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరామర్శించారు. శనివారం రఘునాథపాలెం మండలంలోని వీ వెంకటాయపాలెంలో నిర్వహించిన యరగర్ల పిచ్చయ్య సంస్మరణ కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. పిచ్చయ్య చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఖమ్మం ఏఎంసీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, తుమ్మల యుగంధర్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం, సాదు రమేశ్‌రెడ్డి, కమర్తపు మురళీ, గుత్తా వెంకటేశ్వరరావు, మేళ్లచెర్వు వెంకటేశ్వర్లు, కల్యాకుంట్ల గోపాల్, మొంతుల శ్రీశైలం, మిక్కిలినేని నరేందర్, కాంగ్రెస్ గ్రామశాఖ కార్యదర్శి బానోత్ కిషోర్, మాజీసర్పంచి కాపా ఆదినారాయణ, రావెళ్ల శ్రీనివాస్, మూడ్ శంకర్, కిలారు వెంకటరమణ, దారా మాధవరావు, పంకు కిషోర్, పరుచూరి శ్రీనివాస్ నివాళులు అర్పించారు.



నివాళులు అర్పిస్తున్న మంత్రి తుమ్మల

వైరా మునిసిపాలిటీలో సిబ్బంది చేతివాటం

వైరా, మే 10 (ఆంధ్రజ్యోతి): వైరా మున్సిపాలిటీలోని స్క్రాప్‌ను ఒకరిద్దరు సిబ్బంది కుమ్మకై పాత ఇనుప సామాను కొట్లో విక్రయించి సొమ్ము చేసుకున్నారు. ఇదివరకు కూడా వైరా మున్సిపాలిటీ పదోవార్డులోని వాటర్ ట్యాంకును కూల్చివేసి స్క్రాప్‌ను విక్రయించుకొని సొమ్ము చేసుకున్న సిబ్బందే మళ్లీ ఇప్పుడు మున్సిపల్ కార్యాలయంలో ఉన్న దాదాపు ఐదు టన్నుల స్క్రాప్‌ను విక్రయించిన వ్యవహారం బయటపడింది. ఇంత జరుగుతున్నా మున్సిపల్ అధికారులకు చీమకుట్టినట్లు కూడా లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పాత గ్రామపంచాయతీ కార్యాలయ భవనంలోని ఐదుటన్నుల స్క్రాప్‌ను గుట్టు చప్పుడు కాకుండా ఒకరిద్దరు సిబ్బంది కలిసి అక్రమంగా విక్రయించినప్పటికీ పట్టించుకొనే నాథుడే కరువయ్యారు. ఈ పాత పంచాయతీ కార్యాలయ భవనాన్ని శుక్రవారం వైరా ఎక్సైజ్ స్టేషన్‌కు మున్సిపల్ అధికారులు అప్పగించారు. ఆ వెంటనే ఆభవనంలో ఉన్న స్క్రాప్ మొత్తాన్ని మున్సిపాలిటీలో అన్నీ తానే అని వ్యవహరిస్తున్న సిబ్బందిలోని ఒకరిద్దరు చడీచప్పుడు కాకుండా ఈ స్క్రాప్‌ను అమ్మి వేలాదిరూపాయలు దండుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మసీదు కాంప్లెక్స్ సమీపంలోని పాత ఇనుప సామాను దుకాణంలో ఈ స్క్రాప్‌ను విక్రయించినట్లు సమాచారం తెలిసిన వెంటనే మీడియా ప్రతినిధులు దీనిపై ఆరా తీసినప్పటికీ మున్సిపల్ అధికారులు ఏమాత్రం స్పందించలేదు. ఇప్పటికైనా అక్రమంగా స్క్రాప్ విక్రయించిన విషయమై ప్రత్యేక అధికారి స్పందించి సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



పాతఇనుప సామగ్రి షాపలో మునిసిపల్ స్క్రాప్

మెకానిక్ కుటుంబానికి ఆర్థిక సాయం

ఖమ్మంచర్చికాంపౌండ్,మే10(ఆంధ్రజ్యోతి):పదేళ్లుగా ఖమ్మంలో మెకానిక్‌గా పనిచేసిన మద్దోజు భాస్కర్ అనారోగ్యం కారణంగా ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. తోటి మెకానిక్‌లు ఆర్థిక పరిస్థితిని ఖమ్మం కార్పొరేషన్ టూవీలర్ మెకానిక్ యూనియన్ అధ్యక్షుడు వంగాల కొండల్‌రావు దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో యూనియన్ అధ్యక్షుడు కొండలరావు ఆధ్వర్యంలో రూ.10వేల చెక్కును శనివారం బాధితుడు భాస్కర్‌కు నగరంలోని యూనియన్‌కార్యాలయంలో అందించారు. మెకానిక్ సోదరులకు ఏ ఆపద వచ్చినా సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమలో బ్రహ్మచారి, హమీద్, మురళిశేషు,నాగుల్‌మీరా,సత్యనారాయణ, ఉపేందర్ పాల్గొన్నారు.



నగదు చెక్కును అందిస్తున్న నాయకులు

గేది కళేబరం తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఖమ్మంరూరల్,మే10(ఆంధ్రజ్యోతి):ఏదులాపురంమునిసిపాలిటీ పరిధిలోని గుర్రాలపాడు సమీపంలో వారంరోజులక్రితం రోడ్డు ప్రమాదంలో ఓ గేదె మృతిచెందింది. ఖమ్మం-కోదాడ ప్రధానరహదారి రోడ్డు పక్కన ఈకళేబరం పడిఉంది. దుర్వాసన వస్తుండటతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వారంరోజులుగా ఎవరు పట్టించుకోలేదు. ఈ విషయమై రోడ్డుపై గేదే కళేబరంఅని 'ఆంధ్రజ్యోతి'లో శనివారం కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన మునిసిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి శనివారం కళేబరాన్ని సిబ్బందితో తొలగించారు.

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్ముకోవాలి

తిరుమలాయపాలెం, మే10(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలని తహసీల్దార్ జి.సుధీర్ అన్నారు. శనివారం మండలంలోని జూపెడలో ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలో అమ్ముకుని మద్దతు ధర పొందాలన్నారు. ప్రైవేటు వ్యక్తులకు అమ్మి నష్టపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ నరసింహారావు, ఆర్ఐల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మల్లయ్య కుటుంబానికి కందాళ పరామర్శ

తిరుమలాయపాలెం, మే10(ఆంధ్రజ్యోతి): మండలంలోని రఘునాథపాలేనికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు గొని మల్లయ్య కుటుంబాన్ని శనివారం పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి పరామర్శించారు. మల్లయ్య మాతృమూర్తి ఇటీవల మరణించగా కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వీరన్న, నాయకులు నర్సిరెడ్డి, బోడ మంచానాయక్, ఎస్కే చాంద్, బానోతు రవి పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో టీడీపీ సత్తా చాటాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న వాసిరెడ్డి రామనాథం

వైరా, మే10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్థానిక సంస్థలకు ఎప్పుడు ఎన్నికలు జరిగినా పార్టీ సత్తా చాటాలని టీడీపీ ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం పిలుపునిచ్చారు. శనివారం వైరా టీడీపీ మండల కార్యాలయంలో జరిగిన సమావేశంలో పార్టీ నూతన గ్రామకమిటీల ఎన్నికల వివరాలను ఆయన ప్రకటించారు. కిలారు సురేందర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెరుకూరి చలపతిరావుతో కలిసి ఎన్నికైన గ్రామకమిటీలకు ధ్రువపత్రాలను రామనాథం అందజేశారు. గత 20సంవత్సరాలకుపైగా రాష్ట్రంలో పార్టీ అధికారంలో లేకపోయినప్పటికీ కార్యకర్తలు, అభిమానుల్లో పార్టీ ఉనికి చెక్కుచెదర్లేదని పేర్కొన్నారు. ఉగ్రవాదుల దాడులు, పాక్ సైనికుల కాల్పుల్లో మరణించిన ప్రజలు, సైనికులకు సంతాప తెలుపుతూ మౌనం పాటించారు. నాయకులు మందడపు మధుసూదన్‌రావు, మన్నేపల్లి ప్రదీప్, పర్సా రామకృష్ణ, మోత్కూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలి

బోనకల్, మే 10 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ పున్నం చందర్ రైతులకు తెలిపారు. మండలంలోని చిరునోముల, మోటమర్రి గ్రామాల్లో శనివారం రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. రెండు గ్రామాల్లో 252 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని భూ సమస్యలకు సంబంధించి రైతుల నుంచి దరఖాస్తులు వస్తున్నాయని తెలిపారు. భూభారతి చట్టం ద్వారా సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో గిర్దావర్ మైథిలి, నవీన్, సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో టీడీపీ సత్తా చాటాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న వాసిరెడ్డి రామనాథం

వైరా, మే 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్థానిక సంస్థలకు ఎప్పుడు ఎన్నికలు జరిగినా పార్టీ సత్తా చాటాలని టీడీపీ ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం పిలుపునిచ్చారు. శనివారం వైరా టీడీపీ మండల కార్యాలయంలో జరిగిన సమావేశంలో పార్టీ నూతన గ్రామకమిటీల ఎన్నికల వివరాలను ఆయన ప్రకటించారు. కిలారు సురేందర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెరుకూరి చలపతిరావుతో కలిసి ఎన్నికైన గ్రామకమిటీలకు ధ్రువపత్రాలను రామనాథం అందజేశారు. గత 20సంవత్సరాలకుపైగా రాష్ట్రంలో పార్టీ అధికారంలో లేకపోయినప్పటికీ కార్యకర్తలు, అభిమానుల్లో పార్టీ ఉనికి చెక్కుచెదర్లేదని పేర్కొన్నారు. మద్దతుదారులంతా ఏకమై స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సత్తా చాటాలని కోరారు. ఉగ్రవాదుల దాడులు, పాక్ సైనికుల కాల్పుల్లో మరణించిన ప్రజలు, సైనికులకు సంతాప తెలుపుతూ మౌనం పాటించారు. నాయకులు మండడపు మధుసూదన్‌రావు, మన్నేపల్లి ప్రదీప్, పర్సా రామకృష్ణ, మోత్కూరి వెంకటేశ్వరరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

జమలాపురం శ్రీవారికి సర్వాంగాభిషేకం



ప్రధాన ద్వారం వద్ద శ్రీవారిని దర్శించుకుంటున్న భక్తులు

ఎర్రుపాలెం, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారికి శనివారం సర్వాంగాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో పంచామృతాలు, సుగంధద్రవ్యాలతో సర్వాంగాభిషేకం నిర్వహించి ముత్యాల అలంకారంలో భక్తులకు దర్శనం కలిపించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారి ఉత్సవాలను పల్లకీలో ఊరేగించి కళ్యాణ వేదిక వద్దకు చేర్చి నిత్యకళ్యాణం నిర్వహించారు. భక్తులు పాలు, పొంగళ్లను శ్రీవారికి నివేదించారు. భక్తులు నూతన వాహనాలకు పూజాది కార్యక్రమాలు నిర్వహించుకుని తమ నూతన వాహనాలతో గిరి ప్రదక్షిణలు చేశారు. శ్రీవారి ఆలయంతోపాటు భక్తులు ఉపాలయాలను దర్శించుకున్నారు. శనివారం కావడంతో ఆలయంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. శ్రీవారిని దర్శించుకున్న భక్తులకు శ్రీ వెంకటేశ్వర స్వామి అన్నదాన సత్రంలో దాతలు సహకారంతో సేవా సమితి నిర్వాహకులు అన్నగోవిందంలో భాగంగా భక్తులకు ఉచితంగా అన్నవితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో కొత్తూరు జగన్మోహన్‌రావు, ఆలయ ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ కె.విజయకుమారి, జూనియర్ అసిస్టెంట్ ఇరుకులపాటి కృష్ణప్రసాద్, అర్చకులు రాజీవ్‌శర్మ, మురళీమోహన్ శాస్త్రి, వెంకటేశ్వర సమితి నిర్వాహకులు ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

మధిరటౌన్ 10 (ఆంధ్రజ్యోతి): గత ఐదు రోజులుగా జరుగుతున్న మధిర బంజార కాలనీ శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ 16వ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం మహ అన్నదానంతో ముగిశాయి. వైఖానస ఆగమ శాస్త్ర పండితులు వేదాంతం సుధీర్ నాథ్ ఆచార్యులు, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస అనంతాచార్యుల ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు తిరుమల తిరుపతిలో జరిగినట్లుగానే వైఖానస పద్ధతులతో బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. ఆఖరి రోజు జరిగిన అన్నదానాన్ని ఆలయ కమిటి అధ్యక్షురాలు గుర్రం ప్రమీల ప్రారంభించారు, దాదాపు ఐదు వేల మంది భక్తులకు అన్నదానాన్ని నిర్వహించారు. శుక్రవారం రాత్రి స్వామి వారు అమ్మ వార్ల ఊరేగింపును పట్టణ పురవీదుల్లో మేళతాళాలు, అన్నమాచార్య సంకీర్తనలు, మహిళా కోలాట బృందం వారి ప్రదర్శనలతో ఎంతో అద్భుతంగా సాగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షురాలు గుర్రం ప్రమీల, రామారావు



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

సభ్యులు మల్లాది వాసు, కళ్యాణపు పుల్లారావు, గొండేల ముత్తయ్య, నాగిరెడ్డి, కోనేరు లీలాశంకర్, కటకం నరసింహరావు, చీదిరాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వీరజవాన్ మురళీనాయక్‌కు నివాళులు



వీరజవాన్‌కు నివాళులర్పిస్తున్న ఉపాధి హామీకూలీలు

ఏన్కూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): యుద్ధభూమిలో వీరమరణం పొందిన జవాన్ మురళీనాయక్‌కు శనివారం తూతక్కలింగన్నపేట గ్రామానికి చెందిన ఉపాధి హామీకూలీలు మౌనం పాటిస్తూ నివాళులర్పించారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం విరామం లేకుండా పోరాడుతున్న భారత సైన్యానికి మద్దతు ప్రకించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ రాణి, ఉపాధి హామీకూలీలు పాల్గొన్నారు.

కారేపల్లి మే 10 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌కు ఉపాధి హామీ కూలీలు సంఘీభావం తెలిపారు. శనివారం మండల పరిధిలోని మాణిక్యారంలో ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్న వందలాదిమంది కూలీలు పనిప్రదేశంలో జాతీయజెండా చేతపట్టిముందుగ సంఘీభావం ప్రకటించారు. అనంతరం దాడులలో వీరమరణంపొందిన అమరజావాన్లకు రెండు నిమిషాలు మౌనంపాటించి, జోహర్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా డిప్యూటీ సీఎం దంపతుల వివాహ వార్షికోత్సవం



కేక్ కట్ చేస్తున్న మండల అధ్యక్షుడు కిషోర్

మధిరటౌన్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, నందిని దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలను శనివారం మధిరలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ కేక్‌కట్ చేశారు, ఈ సందర్భంగా అనునిత్యం మధిర అబివృద్ధికి పాటుపడే ఆదర్శ దంపతులైన భట్టి, నందిని గార్లను ఆ దేవుడు కలకాలం చల్లగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగా హనుమంతరావు, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు తూమాటి నవీన్ రెడ్డి, కిసాన్‌సెల్ అధ్యక్షులు దుంపా వెంకటేశ్వర రెడ్డి, మాజీ సర్పంచ్‌లు చిట్టిబాబు, హరిబాబు, కర్నాటి రామారావు, నిడమానూరు వంశీ, దారా బాలరాజు, పాటిబండ్ల సత్యంబాబు, యన్నం కోటేశ్వరరావు, చావలి రామరాజు, అద్దంకి రవి, జహంగీర్, గొల్లమందల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ బోల్తా



ముదిగొండ, మే 10 (ఆంధ్రజ్యోతి): అదుపుతప్పి ఇసుక ట్రాక్టర్ బోల్తా పడిన సంఘటన ముదిగొండ మండలం చిరుమర్రి వద్ద శనివారం జరిగింది. పెద్దమండవ మున్నేరు నుంచి ఇసుకను లోడ్ చేసుకుని చిరుమర్రి వైపు వస్తున్న ట్రాక్టర్ ఎన్నెస్పీ కాల్వ వద్ద అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. ఇదిలా ఉంటే ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడడంతో అందులోని ఇసుక రోడ్డుపై పడిపోయింది. రోడ్డుపై పడిపోయిన ఇసుకను స్థానికులు పక్కకు తరలించారు.

మున్సిపాలిటీ స్క్రాప్‌లో సిబ్బంది చేతివాటం



పాత ఇనుప సామాగ్రి షాప్‌లో మున్సిపల్ స్క్రాప్

వైరా, మే 10 (ఆంధ్రజ్యోతి): వైరా మున్సిపాలిటీలోని స్క్రాప్‌ను ఒకరిద్దరు సిబ్బంది కుమ్మక్కై పాత ఇనుప సామాను కొట్లో విక్రయించి సొమ్ము చేసుకున్నారు. ఇదివరకు కూడా వైరా మున్సిపాలిటీ పదోవార్డులోని వాటర్ ట్యాంకును కూల్చివేసి స్క్రాప్‌ను విక్రయించుకొని సొమ్ము చేసుకున్న సిబ్బందే మళ్లీ ఇప్పుడు మున్సిపల్ కార్యాలయంలో ఉన్న దాదాపు ఐదు టన్నుల స్క్రాప్‌ను విక్రయించిన వ్యవహారం బయటపడింది. ఇంత జరుగుతున్నా మున్సిపల్ అధికారులకు చీమకుట్టినట్లు కూడా లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పాత గ్రామపంచాయతీ కార్యాలయ భవనంలోని ఐదుటన్నుల స్క్రాప్‌ను గుట్టుచప్పుడు కాకుండా ఒకరిద్దరు సిబ్బంది కలిసి అక్రమంగా విక్రయించినప్పటికీ పట్టించుకొనే నాథుడే కరువయ్యారు. ఈ పాత పంచాయతీ కార్యాలయ భవనాన్ని శుక్రవారం వైరా ఎక్సైజ్ స్టేషన్‌కు మున్సిపల్ అధికారులు అప్పగించారు. ఆ వెంటనే ఆభవనంలో ఉన్న స్క్రాప్ మొత్తాన్ని మున్సిపాలిటీలో అన్నీ తానే అని వ్యవహరిస్తున్న సిబ్బందిలోని ఒకరిద్దరు చడీచప్పుడు కాకుండా ఈ స్క్రాప్‌ను అమ్మి వేలాదిరూపాయలు దండుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మసీదు కాంప్లెక్స్ సమీపంలోని పాత ఇనుప సామాను దుకాణంలో ఈ స్క్రాప్‌ను విక్రయించినట్లు సమాచారం తెలిసిన వెంటనే మీడియా ప్రతినిధులు దీనిపై ఆరా తీసినప్పటికీ మున్సిపల్ అధికారులు ఏమాత్రం స్పందించలేదు. ఇప్పటికైనా అక్రమంగా స్క్రాప్ విక్రయించిన విషయమై ప్రత్యేక అధికారి స్పందించి సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సత్తుపల్లిలో పీవీ రావు జయంతి వేడుకలు



సత్తుపల్లిలో పీవీ.రావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాల మహానాడు నాయకులు

సత్తుపల్లిరూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): మాల మహానాడు పోరాటానికి ఆద్యుడు పీవీ.రావు జయంతి వేడుకలను శనివారం సత్తుపల్లిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద పీవీ.రావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. షెడ్యూల్ కులాలను ఏ,బీ,సీ,డీ గ్రూపులుగా వర్గీకరించడాన్ని వ్యతిరేకిస్తూ ఆయన అప్పటి ఆంధ్రప్రదేశ్‌లో దళిత మాల మహానాడు ఉద్యమానికి నాయకత్వం వహించారన్నారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాలలంతా ఐక్యంగా పోరాడాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిల్లి మల్లిఖార్జున్, యనమాల నాగరాజు, సుకభోగి రాము, బల్లెం చిరంజీవి, జంగం కిరణ్, పోతురాజు సతీష్, కటుకూరి కృష్ణ, బీవీ, గుంట్రు సూర్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సుశీలమ్మ కుటుంబానికి తుమ్మల యుగందర్ పరామర్శ



నివాళులర్పిస్తున్న తుమ్మల యుగందర్

బోనకల్, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయనపేట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తూము సుశీలమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె కుటుంబ సభ్యులను శనివారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు, కాంగ్రెస్ నాయకుడు యుగందర్ పరామర్శించారు. సుశీలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బత్తినేని చారిటబుల్ ట్రస్టు చైర్మన్ నాగ ప్రసాదరావు, బత్తినేని ప్రకాష్, ఆత్మ కమిటీ చైర్మన్ కర్నాటీ రామకోటేశ్వరరావు, బొమ్మినేని కొండలరావు, ఏలూరి పూర్ణ చంద్రరావు, వల్లెబోయిన కొండలరావు, కొంగర పూర్ణ చందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుదర్శన యాగం

ఖమ్మంఖానాపురంహవేలి, మే 10 (ఆంధ్రజ్యోతి): స్థంబాద్రి లక్ష్మీ నరసింహా స్వామి ఆలయంలో వార్షిక పంచాహ్నిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం ఆలయంలో సుదర్శన యాగంను ఘనంగా నిర్వహించారు. అలాగే పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో జగన్‌మోహన్‌రావు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు నరహరి నర్సింహాచార్యులు, రామకృష్ణా చార్యులు, శ్రీనివాసచార్యులు ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పోగొట్టుకున్న ఫోన్లు బాధితులకు అందజేత



బాధితులకు సెల్‌ఫోన్లు అందజేస్తున్న సీఐ మురళీ, ఎస్‌ఐలు

ముదిగొండ, మే 10 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలంలోని వివిధ ప్రదేశాల్లో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను ఆరుగురు బాధితులకు శనివారం సీఐ మురళీ అందజేశారు. వివిధ ప్రదేశాల్లో పోగొట్టుకున్న సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి రికవరీ చేసినట్లు సీఐ తెలిపారు. పోగొట్టుకున్న ఆరు సెల్‌ఫోన్ల విలువ సుమారు రూ.70వేలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, బాధితులు తెలిపారు.

నగరానికి మొక్కల అందాలు.. కేఎంసీలో ఖాళీ కుండీలు



కమిషనర్ చాంబర్ వద్ద మూలనపడేసిన కుండీలు

ఖమ్మంసంక్షేమవిభాగం, మే 10 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని డివైడర్లు నుంచి పార్కుల వరకు అందమైన పూల మొక్కలను నాటుతూ వాటిని రక్షిస్తున్న కేఎంసీ ఉద్యాన విభాగం అధికారులు ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంపై మాత్రం వివక్ష చూపుతున్నారు. కేఎంసీ అధికారుల విభాగాల నుంచి ఉద్యాన అధికారుల విభాగాల వరకు గతంలో మొక్కల కోసం కుండీలు ఏర్పాటు చేశారు. ఐనప్పటికీ కనీసం ఏదో ఒక మొక్కను నాటలేక పోతున్నారు. దీంతో కమిషనర్ ఛాంబర్ వద్ద మొక్కల కుండీలు మూలకు చేరటంతో కేఎంసీలోని ఎగ్జామినర్ అధికారి ఎవ్వరికి చెప్పకుండానే మొక్కల కుండీలను తన చాంబర్‌లోకి తీసుకెళ్లారు. వివాదం ఏర్పడటంతో తిరిగి కమిషనర్ చాంబర్‌కు తీసుకొచ్చి పెట్టారు. కానీ ఉద్యాన అధికారులు మాత్రం ఖాళీ కుండీల్లో మొక్కలను మాత్రం నాటటం లేదు. ఈ విషయంపై కేఎంసీ ఉద్యాన అధికారి బెల్లం రాధికను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా రెండు రోజుల్లో కేఎంసీలోకి మొక్కలను ఏర్పాటు చేస్తామన్నారు.

వైరా ఎస్ఐగా పుప్పాళ్ల రామారావు



వైరా, మే 10 (ఆంధ్రజ్యోతి): వైరా ఎస్ఐగా పుప్పాళ్ల రామారావు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఖమ్మం టాస్క్‌ఫోర్స్‌లో ఎస్ఐగా పనిచేస్తున్న రామారావు వైరా ఎస్ఐగా నియమితులయ్యారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన వంశీకృష్ణ భాగ్యరాజ్ ఖమ్మానికి బదిలీ అయ్యారు. ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన రామారావు ఆ తర్వాత వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అక్కడే ఉన్న రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ కూడా ఆయనను మర్యాదపూర్వకంగా లిశారు.

ఘనంగా లక్ష్మి నరసింహాస్వామి కళ్యాణ మహోత్సవం

ఎర్రుపాలెం, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మీనవోలు గ్రామంలో కొలువైన శ్రీ లక్ష్మి నరసింహాస్వామి ఆలయలో శనివారం ఆలయ అర్చకుడు కాశవజ్జుల రాము అర్చకత్వంలో స్వామి వారి కళ్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో కళ్యాణ వేదిక నిర్మించి గ్రామంలో ఐదుగురు దంపతులచే మంగళవాయిద్యాలు, వేద మంత్రాలు మధ్య కన్నుల పండువగా నిర్వహించారు. జగత్ రక్షణకోసం స్వామివారు లక్ష్మీదేవి మెడలో మంగళసూత్రదారణ గావించారని, స్వామి వారి కరుణాకటాక్షములు అమ్మవారితో పాటు సమస్త లోకాలకు సంతరిస్తాయని అర్చకులు వివరించారు ఆలయం ఆవరణమంతా నమో నారసింహ, జై నారసింహ , గోవింద నామస్మరణతో మారుమోగింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీసభ్యులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

గోల్‌తండాలో ఘనంగా నాభిశిల ప్రతిష్ఠ



పూజలో పాల్గొన్న శివరామకృష్ణ

తిరుమలాయపాలెం, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోల్‌తండాలో (నాభిశిల) ద్వితీయ సంవత్సర వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆత్మకమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ, ఏఎంసీ డైరెక్టర్ జడల నగేష్, కాంగ్రెస్ నాయకులు చీకటి శ్రీను, బానోతు శివాజీ, ఎస్‌డీ సైదా, మదార్, బానోతు రంగా తదితరులు పాల్గొన్నారు.

సీతారామ కెనాల్‌ను పాలేరుకు అనుసంధానించాలి

» తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాంబాబు

బోనకల్, మే 10 (ఆంధ్రజ్యోతి): సీతారామ ప్రాజెక్టు కెనాల్‌ను పాలేరు జలాశయానికి అనుసందానం చేయాలని తెలంగాణ రైతుసంఘ జిల్లా ప్రదాన కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 6.5 లక్షల ఎకరాలకు నీరందించే సీతారామ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు గానూ అవసరమైన నిధులను ప్రభుత్వం సమకూర్చడం లేదన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వినోభనగర్ వద్ద 17 నెలల నుంచి పనులు నిలిచిపోయినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని ముగ్గురు మంత్రులు బాధ్యత తీసుకుని సత్వరమే ప్రాజెక్టు పనులను పూర్తి చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విదానాలను అనుసరిస్తుందన్నారు. స్వామినాథన్ కమీషన్ సిఫార్సులు అమలు చేసి వ్యవసాయ ఉత్పత్తుల ధరలకు చట్టబద్దత కల్పించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం నాయకులు నాగేశ్వరరావు, కిలారు సురేష్, కొంగర వెంకట నారాయణ, కందికొండ శ్రీనివాసరావు, బంధం శ్రీనివాసరావు, తిరుపతిరావు, నాగచంద్రుడు, శంకర్ రావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బొంతు రాంబాబు